ఓ౩మ్

అథర్వ వేదీయ

ప్రశ్నోపనిషత్తు

(ఆంధ్ర టీకా తాత్పర్య సహితము)

*

పండిత గోపదేవ్

*

ప్రకాశకులు :

ఆర్య సమాజము - కూచిపూడి

1995

అంబాదర్శన గ్రంథమాల - ౨౨

తృతీయ సంస్కరణము - ౨౦౦౦

యువనామ సంవత్సరము చైత్రమాసము ఏప్రిల్ 1995

మూల్యము : రు. 7-00

ముద్రణ : విజయ ఆర్టు ప్రెస్, తెనాలి.

సంపాదకీయము

సంస్కృత భాష వైదికము లౌకికము నని రెండు విధములు. శాఖలు, వ్యాఖ్యానములతో గూడిన ఋగాది వేదములు నాలుగు, గాంధర్వా ద్యుపవేదములు నాలుగు, ఉపాంగ (దర్శన) సహితములగు శిక్షాదివేదాంగము లాఱు నన్నియు వైదిక భాషకు సంబంధించినవి. వైదికవాఙ్మయమున వీనిని చతుర్దశ విద్య లందురు.

రామాయణ మహాభారతాది గ్రంథజాత మంతయు లౌకికభాషకు సంబంధించినది.

మానవుల జ్ఞానము పరసాహాయ్యము లేనిచో వికసింపదు. మొదట తల్లిదండ్రులయు, పిమ్మట గురువులయు తోడ్పాటుతో బిడ్డల జ్ఞానమభివృద్ధి జెందును. అట్లే సృష్ట్యాది నాదిగురువగు పరమేశ్వరుని వలన మహర్షుల ద్వారమున లభించిన జ్ఞానమే వేదములు. అనగా సమాధ్యవస్థలో తమ పరిశుద్ధాంతఃకరణము లందు ఈశ్వరునిచే ప్రతిభాసింపజేయబడిన వేద మంత్రములను అర్థసహితముగ గ్రహించి ఋషులు శిష్యులకు బోధించుచు వచ్చిరి. అవియే ఋగాది చతుర్వేదములు. వైదికభాష కవి మూలములు. వానికి సంహితలు, మంత్రభాగములు, శ్రుతులు, ఛందస్సులు నని నామాంతరములు. ఇట్లు ఈశ్వర ప్రోక్తము లగుటంజేసి ఋగాదులు ఈశ్వరీయములు, అపౌరుషేయములు అనబడినవి. ఈశ్వరుడు నిత్యుడు, సర్వజ్ఞుడు. కనుక ఈశ్వరీయ వేదములు నిత్యములు, సంపూర్ణములు, స్వతః ప్రమాణములు నని వేదతత్త్వవిదులు భారతీయ విద్వాంసులు చెప్పుదురు. మానవులకు కావలసిన జ్ఞానమంతయు నావేదములం దిమిడియున్నదనివారెంచెదరు.

సమాహితచిత్తులై మంత్రములను మంత్రార్థములను స్వయముగ తెలుగజాలని వారికి వేదార్థములు బోధపడుటకై మహర్షులు శతపథాది

అంబాదర్శన గ్రంథమాల - ౨౨

తృతీయ సంస్కరణము - ౨౦౦౦

సర్వస్వామ్యములు : ఆర్య సమాజము-కూచిపూడి

యువనామ సంవత్సరము చైత్రమాసము ఏప్రిల్ 1995

మూల్యము : రు. 7-00

ముద్రణ : విజయ ఆర్ట్ ప్రెస్, తెనాలి.

సంపాదకీయము

సంస్కృత భాష వైదికము లౌకికము నవి రెండు విధములు. శాఖలు, వ్యాఖ్యానములతో గూడిన ఋగాది వేదములు నాలుగు, గాంధర్వా ద్యుపవేదములు నాలుగు, ఉపాంగ (దర్శన) సహితములగు శిక్షాదివేదాంగము లాఱు నన్నియు వైదిక భాషకు సంబంధించినవి. వైదికవాఙ్మయమున వీనిని చతుర్దశ విద్య లందురు.

రామాయణ మహాభారతాది గ్రంథజాత మంతయు లౌకికభాషకు సంబంధించినది.

మానవుల జ్ఞానము పరసాహాయ్యము లేనిచో వికసింపదు. మొదట తల్లిదండ్రులయు, పిమ్మట గురువులయు తోడ్పాటుతో బిడ్డల జ్ఞానమభివృద్ధి జెందును. అట్లే సృష్ట్యాది నాదిగురువగు పరమేశ్వరుని వలన మహర్షుల ద్వారమున లభించిన జ్ఞానమే వేదములు. అనగా సమాధ్యవస్థలో తమ పరిశుద్ధాంతఃకరణము లందు ఈశ్వరునిచే ప్రతిభాసింపజేయబడిన వేద మంత్రములను అర్థసహితముగ గ్రహించి ఋషులు శిష్యులకు బోధించుచు వచ్చిరి. అవియే ఋగాది చతుర్వేదములు. వైదికభాష కవి మూలములు. వానికి సంహితలు, మంత్రభాగములు, శ్రుతులు, ఛందస్సులు నని నామాంతరములు. ఇట్లు ఈశ్వర ప్రోక్తము లగుటంజేసి ఋగాదులు ఈశ్వరీయములు, అపౌరుషేయములు అనబడినవి. ఈశ్వరుడు నిత్యుడు, సర్వజ్ఞుడు. కనుక ఈశ్వరీయ వేదములు నిత్యములు, సంపూర్ణములు, స్వతః ప్రమాణములు నని వేదతత్త్వవిదులు భారతీయ విద్వాంసులు చెప్పుదురు. మానవులకు కావలసిన జ్ఞానమంతయు నావేదములం దిమిడియున్నదనివారెంచెదరు.

సమాహితచిత్తులై మంత్రములను మంత్రార్థములను స్వయముగ నెఱుగజాలని వారికి వేదార్థములు బోధపడుటకై మహర్షులు శతపథాది

బ్రాహ్మణము లను వేదవ్యాఖ్యాన గ్రంథములను రచించిరి. బ్రహ్మమన వేదము, బ్రహ్మమునకు వ్యాఖ్యానము బ్రాహ్మణ మనబడును.

ఇంకను వేదార్థములను ప్రచారముచేయు నిమిత్తము మహర్షులు ఆరణ్యకములను పేర కొన్ని గ్రంథములు వ్రాసియున్నారు.

వేదములందలి ఆధ్యాత్మిక తత్త్వములను దెలుపుటకు వ్రాయబడిన గ్రంథములు ఉపనిషత్తులు. కేనాది దశైకాదశోపనిషత్తులు సంస్కృత సాహిత్యమున నతి ప్రసిద్ధములు.

ఇట్లు బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులనను మువ్విధ గ్రంథసాహిత్యము ఋషిప్రోక్తమని తెలియవలయును. అయితే నేడుపనిషత్తు లలో పరిగణింపబడు ఈశావాస్యము మాత్రము యజుర్వేదములోని (40వ) అంతిమాధ్యాయము. కనుక నయ్యది ఈశ్వరీయమగును. తక్కిన ఉపనిషత్తులన్నియు మహర్షి ప్రోక్తములే. కాని -

వేదముల పయి ప్రజలకు విశ్వాసము గలదు. వేదమతమును వారు సులభముగ నంగీకరింతురు. కావున వేదముల పేరిట తమమతములను, ఆచారములను చెల్లుబడి చేసికొనుటకై విద్వాంసులు బ్రాహ్మణములను, ఆరణ్యకములను, ఉపనిషత్తులనుకూడ వేదభాగములని మధ్యకాలములో చెప్పసాగిరి.

కాని వ్యాఖ్యాన గ్రంథములగు బ్రాహ్మణములు మూలములు కావని వేఱుగ చెప్పనక్కఱలేదు. ఇక ఉపనిషత్తులు వేదముల యంతిమ భాగములు-వేదశిరస్సులు-వేదాంతములు అని చెప్పి, విశ్వసించు విద్వాంసు లెందఱో గలరు. కాని 1180 వఱకు ఉన్నట్లు పరిగణింపబడు ఉపనిషత్తులు ఋగాది వేదములు నాలుగింటికి శిరస్సులు-అంతిమ భాగములు ఎట్లగునో వీ రాలోచించుటలేదు. అదియుంగాక మహర్షి ప్రణీతములగు కేనాద్యుపనిషత్తులు ఈశ్వరీయములగు వేదములుకాని వేదభాగములుకాని యెట్లగును? ఈ ప్రశ్నోపనిషత్తునందే ప్రథమాధ్యాయము ప్రథమఖండమున -

"స ఏష వైశ్వానరో విశ్వరూపః
ప్రాణోఽగ్ని రుదయతే, త దేతద్ ఋచాభ్యుక్తమ్."

అనుచు మహర్షి తా జెప్పిన విషయమును ఋఙ్మంత్రముకూడ చెప్పు చున్నదని (ఋచాభ్యుక్తమ్) మంత్ర ప్రమాణమును జూపుచున్నాడు. ఉపనిషత్తు వేదమగుచో తా జెప్పిన విషయమును ధృవపఱచుటకై మహర్షి వేద మంత్రము నేల ప్రమాణీకరించును? ఇట్లే కఠోపనిషత్తుకూడ "సర్వే వేదా య త్పద మామనంతి" (౧-౨-౧౫) అని వేదములను వేఱుగా పేర్కొనుచున్నది. వీనింబట్టి ఉపనిషత్తులు వేదములుకాని వేదభాగములు కాని కావని స్పష్టమగుచున్నది.

ఇట్లు బ్రాహ్మణాది గ్రంథములు ఋషిప్రోక్తములయి పరతః ప్రమాణము లగుచున్నవి. కావున వానికి స్వతః ప్రమాణములగు ఈశ్వరీయ వేదముల కనుకూలముగ వ్యాఖ్యానము చేసికొనవలయును. వేదప్రతిపాదిత సిద్ధాంతములకు విరుద్ధముగ వాని కర్థము చెప్పుట శిష్టసంప్రదాయమునకు విరుద్ధ మగును.

కాని అద్వైతాది సంప్రదాయముల నెలకొల్పిన శ్రీ శంకరాద్యాచార్యులు తమ సాంప్రదాయిక సిద్ధాంతముల బోధించుటకు వేదమతము నుద్ధరించుచున్నా మన్న వ్యాజమున ఆర్షములగు శ్రీమద్ భగవద్గీత, బ్రహ్మసూత్రములు, ఈశ కేనాది దశైకాదశోపనిషత్తులు నాధారముగా గ్రహించి, ప్రస్థానత్రయమని వానికి నామకరణము చేసి, అద్వైతాది స్వకల్పిత మతములను ప్రచార మొనర్చియున్నారు. స్వ మతానుకూలముగ ప్రస్థాన త్రయమునకు ఆచార్యులెల్లరు వ్యాఖ్యానములు, భాష్యములు వ్రాసి ప్రచారము చేసియున్నారు. కావున వేదమతము మరుగుపడినది. ప్రజలకు దూరమైనది. పరస్పర విరుద్ధమతముల నెక్కొంటిని వేదశాస్త్రములెట్లు బోధించునా? అనియు విద్వాంసు లాలోచింపక తమతమ సంప్రదాయములకు కట్టుబడి మూఢవిశ్వాసమున అవైదిక మతముల ప్రచారము చేయుచున్నారు

కావున ప్రజ లీశ్వరునకు, ఈశ్వరీయ జ్ఞానమునకు దూరులగుట సంభవించి నది. ప్రకృతము వేదములు చదివి అర్థముచేసికొను పండితులును అరుదైరి.

పండిత శ్రీ గోపదేవ్‌గారు నైష్ఠిక బ్రహ్మచారులు. కాశ్యాది విద్యా పీఠములందు పెక్కేండ్లు పండితుల సేవించి వేదము లధ్యయనము చేసిరి. షడ్దర్శనము లభ్యసించిరి. పాతంజలి మార్గమున మంచుకొండల నష్టాంగ యోగము నభ్యసించిరి. అట్టి వీరు శ్రీ మద్దయానంద సరస్వతి యడుగు జాడల వైదిక ధర్మప్రచారము గావించుచు వేదావిరుద్ధముగ వైదిక వాఙ్మ యములోని శాస్త్ర గ్రంథములు పెక్కింటికి ఆంధ్రమున వ్యాఖ్యానములు రచించిరి: రచించుచున్నారు. వీరి వ్యాఖ్యానములతో వెలువడిన యుపనిషత్తు లలో నీ ప్రశ్నోపనిషత్తు ఆఱవది. వేదమతము నుద్ధరించు తలంపున తదను కూలముగ రచించు వీరి వ్యాఖ్యానముల జదువుచో హేతుబద్ధమగు వేద వాదము పాఠకులకు కరతలామలకమగును. అంతియ గాదు. విషమదృష్టాం తములతో డొంకతిరుగుడు అర్థములు కల్పించి, వేదవిరుద్ధముగ అద్వై తాది సంప్రదాయముల నెలకొల్పి, శ్రీ శంకరాచార్యులు స్వ మ తా ను కూలముగ ప్రస్థానత్రయమునకు గావించిన వ్యాఖ్యానములలోని పూర్వాపర విరోధములు - లోపములు స్పష్టములగును. జీవేశ్వర ప్రకృతుల స్వరూప స్వభావాదు లర్థమగును. మూఢ విశ్వాసము అంతరించి తరణోపాయము గోచరించునని నేను విశ్వసించుచున్నాడ.

ఆంధ్రు లీ యవకాశము జారవిడువక పండిత గోపదేవ్‌గారి రచనల బఠించి ప్రయోజనము పొందెదరు గాక.

తమ గ్రంథముల ముద్రణ కార్యభారమును నాపై బెట్టి శ్రీగోపదేవ్ గారి రచనల బాగుగ పరిశీలించు నవకాశము కల్పించి, నా కెంతయు నుపకృతి నొనర్చి నందులకు కూచిపూడి - ఆర్యసమాజ కార్యకర్తలకు నా ధన్యవాదములు.

—o—

ప్రశ్నోపనిషత్తు

"సుకేశా చ భారద్వాజః శైబ్య శ్చ సత్యకామః సౌర్యా యణీ చ గార్గ్యః కౌశల్య శ్చాశ్వలాయనో భార్గవో వైదర్భిః కబంధీ కాత్యాయన స్తే హైతే బ్రహ్మపరా బ్రహ్మనిష్ఠా పరం బ్రహ్మాన్వేషమాణా ఏష హ వై తత్ సర్వం వక్ష్యతీతి తే హ సమిత్ పాణయో భగవంతం పిప్ప లాద ముపసన్నాః" ౧

భారద్వాజః = భరద్వాజుని కుమారుడు, సుకేశాః = సుకేశుడు, శైబ్యః=శిబికుమారుడు, సత్యకామః చ = సత్యకాముడు, సౌర్యాయణీ = సౌర్యునికుమారుడు, గార్గ్యః చ=గార్గ్యుడు, ఆశ్వలాయనః=అశ్వల కుమారుడు, కౌశల్యః చ = కౌశల్యుడును, భార్గవః = భృగుగోత్రమువాడైన, వైదర్భిః చ=విదర్భపుత్రుడు వైదర్భియు, కాత్యాయనః=కత్యుని అపత్యమైన, కబందీ = కబంధియనువాడును, తేహ ఏతే షట్ బ్రహ్మపరాః= ప్రసిద్ధులైన యీ యార్గురు బ్రహ్మమేపరమమని యెంచు తపస్వులు,బ్రహ్మనిష్ఠాః = బ్రహ్మమును తెలిసికొనవలయునను ఉత్కంఠ గలవారు, పరం బ్రహ్మన్వేషమాణాః=పరబ్రహ్మను అన్వేషించుచున్నవారునై, ఏషఃహవై =ఇతడే నిశ్చయముగా, తత్ సర్వం=అది యంతయు, వక్ష్యతి ఇతి = చెప్పగలడు అని. తేహ=ఆ సుకేశాదులెల్ల, సమిత్ పాణయః=హస్తము లందు సమిధలనుధరించి, భగవంతం పిప్పలాదం=పూజ్యుడైన పిప్పలాద మహర్షిని, ఉపసన్నాః=ప్రశ్నించి తెలిసికొన సమీపించిరి.

భరద్వాజుని కుమారుడు సుకేశుడు, శిబి కుమారుడు సత్యకాముడు, సౌర్యాయణి సంతాన మగు గార్గ్యుడు, అశ్వలుని కుమారుడు కౌశల్యుడు, భృగుగోత్ర జనితుడగు వైదర్భి, కత్యుని సంతాన మగు కబంధియు నను నార్గురు తపస్వులు బ్రహ్మమును దెలిసికొనగోరి చేతులలో సమిధలను పటు

1)

కొని బ్రహ్మజ్ఞుని వెదకుచు, పిప్పలాదుడు తమకు బ్రహ్మజ్ఞానము నొసంగ గలడని యెంచి యతని యాశ్రమమున కేగిరి. సుకేశాదులార్గురును బ్రహ్మ జిజ్ఞాసువులు.

("త ద్విజ్ఞానార్థం స గురు మే వాభిగచ్ఛేత్
సమిత్ పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్."

'బ్రహ్మజ్ఞానము కావలయు ననువాడు వేదవిదుడు, బ్రహ్మనిష్ఠుడు నైన వానిని గురువుగా నెంచి, చేతియందు సమిధను పట్టుకొని వానిని సమీపింపవలయును.'

అను నార్యోక్తి ననుసరించి గురువుల కడకు వెళ్ళు నపుడు రిక్త హస్తములతో వెళ్ళుట ఉచితముకాదు; కావున, పిప్పలాదుని సమీపించుచు సుకేశాదులు సమిధలను తీసికొని వెళ్ళిరి. పూర్వము బ్రహ్మజ్ఞులు కూడ నిత్య మగ్నిహోత్రము చేయుచుండెడివారు. కావున నట్టి గురువులకు సమిధలు (అగ్నిహోత్రమున కుపయుక్తములగు కట్టెలు) అభీష్టములు కాకపోవు. గురువుల కభీష్టమగు వస్తువును సమర్పించి, శిష్యులు తమ యందు గల సేవాభావమును వెల్లడించుట శిష్ట సంప్రదాయము. కావుననే సుకేశాదులు సమిధలు చేత నిడుకొని గురువైన పిప్పలాదుని సమీపించి రని గుర్తింపవలయును. జ్ఞానము నభిలషించువారు గురువులయెడ వినయ విధేయతలుగలవారై యుండవలయును. సేవాభావముతోగురువులనికటమున వర్తించి, వారిని ప్రసన్నులంజేసి వారినుండి జ్ఞానము నుపార్జింపవలయును. అవిధేయులై, ధార్ష్ట్యముతో వర్తించి బలమున నితరులనుండి హరింప నగునగు వస్తువు కాదు జ్ఞానము.)

"తాన్ హ స ఋషి రువాచ, భూయ ఏవ తపసా బ్రహ్మ చర్యేణ శ్రద్ధయా సంవత్సరం సంవత్స్యథ, యథాకామం ప్రశ్నాన్ పృచ్ఛథ, యది విజ్ఞాస్యామః సర్వం హ వో వక్ష్యామ ఇతి." ౨

తాన్ = ఆ సుకేశాదుల నుద్దేశించి, హ సః ఋషిః పిప్పలాదః= ఆ ఋషి పిప్పలాదుడు, ఉవాచ=పలికెను. మీరు భూయః ఏవ=మరల, తపసా=తపస్సుతోను, బ్రహ్మచర్యేణ= బ్రహ్మచర్యముతోను, శ్రద్ధయా= శ్రద్ధతోను, సంవత్సరం = ఒక్క సంవత్సరము, సంవత్స్యథ =నా నికట మున వసింతురుగాక; తదుపరి, యథా కామమ్=ఇష్టము వచ్చిన, ప్రశ్నాన్ పృచ్ఛథ=ప్రశ్నల అడుగుడు, యది విజ్ఞాస్యామః=మేము మీ రడుగు ప్రశ్నల నెఱుగ గలిగిన, సర్వం హ=అంతయు, వః=మీకు, వక్ష్యామః ఇతి=చెప్పెదము, అని.

భక్తిశ్రద్ధలతో శుశ్రూషా భావమును వెల్లడించుచు తమసమీపమునకు వచ్చిన సుకేశాదులను జూచి పిప్పలాద ఋషి 'ఇంకను మీ రెల్లరు నొక సంవత్సర సమయము బ్రహ్మచర్యమును పాలించుచు శ్రద్ధతో తపస్సు నొనరింపుడు. అటుపైన మీ యిష్టము వచ్చిన ప్రశ్న లడుగుడు. మాకు తెలిసినచో నంతయు మీకు చెప్పెదము' అని పలికెను.

(సుకేశాదులు హోమయ జీవితముగడిపిన వారైనను బ్రహ్మజ్ఞానము బొందుటకు వలసినంత తపస్సు, బ్రహ్మచర్యము, శ్రద్ధయు వారి యందు పిప్పలాదునకు కనిపింప నందున నట్లాదేశించి యుండును లౌకిక పదార్థ విజ్ఞానము కంటె బ్రహ్మ జ్ఞాన మతిసూక్ష్మము. అట్టి జ్ఞానమును బొందు టకు తగిన యోగ్యత ముందుగా సంపాదించుట యెంతయు నవసరము. బ్రహ్మము మిక్కిలి సూక్ష్మతత్త్వము. దానిని దెలిసికొనుటకు బుద్ధి వైశద్య మెంతయో కావలయును. అందులకు సత్యనిష్ఠ (శ్రద్ధ), ఇంద్రియ నిగ్ర హము - విషయ వాసనలనుండి యింద్రియ గ్రామమును మరలించుట- (తపస్సు), బ్రహ్మచర్యము-ఉపస్థేంద్రియ నిగ్రహము ఎంతయు నావశ్య కములు. వీనివలన బుద్ధికుశలత యేర్పడగలదు.

యోగ్యత సంపాదించిన తదుపరి యెవరికి ఏది యిష్టమో యది యడుగుడని చెప్పి, పిప్పలాదుడు తా మెఱిగినచో నా ప్రశ్నలకు సమాధా

నము చెప్పెద మనుచున్నాడు. దీనింబట్టి యాతనిలో గర్వము లేదని సూచింపబడినది. అంతేకాని బ్రహ్మజ్ఞానము లే ని వా డ ని యెంచరాదు. బ్రహ్మజ్ఞాని కానివాడు 'మీ యిష్టము వచ్చిన దడుగుడు' అని చెప్పజాలడు. బ్రహజ్ఞానియే యట్లనగలడు. అతనికి దెలియని దేమియు నుండదు.)

"అథ కబంధీ కాత్యాయన ఉపేత్య పప్రచ్ఛ,
భగవన్! కుతో హ వా ఇమాః ప్రజాః ప్రజాయ న్త ఇతి." 3

అథ=సంవత్సరము గడచిన తదుపరి, కాత్యాయనః కబంధీ = కత్యుని అపత్యమైన కబంధి, ఉపేత్య=పిప్పలాదుని సమీపించి, పప్రచ్ఛ = అడిగెను, భగవన్ః = స్వామీ!, ఇమాః ప్రజాః=ఈజనులు, ప్రాణులు, పదార్థములు, కుతః ప్రజాయంతే=ఎవనివలన జనించును, ఇతి=అని.

పిప్పలాద మహర్షి యాదేశము ననుసరించి సుకేశాదు లొక సంవత్సర కాలము శ్రద్ధతో తపస్సు చేసి బ్రహ్మచర్యమును పాలించిరి. అటుపై నొకనాడు కత్యుని సంతానమైన కబంధి పిప్పలాదుని సమీపించి భగవన్ ! లోకమున జనించు బ్రాహ్మణాది మానవులు, ఇతర ప్రాణులు,పదార్థములు నెవనివలన జనించుచున్నవిః అని ప్రశ్నించెను.

(దృశ్యమాన ప్రపంచోత్పత్తికి నిమిత్తకారణ మేదైన నున్నదాః ఉన్నచో నదియే సర్వమునకు మూలము కావచ్చు నను నభిప్రాయముతో కబంధి ప్రశ్నించినా డని యాశయము)

"తస్మై స హోవాచ, ప్రజాకామో వై ప్రజాపతిః స తపోఽ తప్యత, స తప స్తప్త్వా స మిథున ముత్పాదయతే; రయించ ప్రాణం చే త్యేతౌ మే బహుధా ప్రజాః కరిష్యత ఇతి." 4

తస్మై=ఆ కబంధికి, సః = పిప్పలాదుడు, హ ఉవాచ = ఇట్లు చెప్పెను, ప్రజాపతిః=ప్రజాపతి_పరమేశ్వరుడు, ప్రజాకామః = ప్రజలను సృజింతు నను స్వాభావికేచ్ఛగల వాడైనపుడు, సః = అతడు, తపః

అతప్యత=తపస్సు నొనరించెను, సః=ఆ ప్రజాపతి, తపఃతప్త్వా=తపించి, రయిం చ ప్రాణం చ = రయి, ప్రాణము, ఇది = అను, మిథునమ్= జంటను, ఉత్పాదయతే=పుట్టించెను, ఏతౌ = రయి, ప్రాణము నను నీ రెండును, మే=నా సృష్టియందు, బహుధాః ప్రజాః=నానావిధ ప్రజలను, కరిష్యతః ఇతి=కలుగజేయును, అని

సుకేశాది జిజ్ఞాసువులలో నొకడు, కాత్యాయనుడునగు కబంధియడిగిన ప్రశ్నకు సమాధానము నిట్లు పిప్పలాదుడు చెప్ప నారంభించెను. ప్రజాపతి ప్రజలను సృష్టింప తపమాచరించెను. పరమేశ్వరుడు సృష్టినొనరింప దలచి నపు డతనిలో స్వాభావికమగు కోరిక యుదయించెను. పరమేశ్వరునకు మనుజులకు వలె కోరిక యుండదు. సృష్టి నారంభించు నపు డతనిలో స్వాభావికమగు సిసృక్ష కలుగును ఈక్షణమనియు దానిని విద్వాంసులు నుడువుదురు. ఈక్షణ వలన రయి ప్రాణము నను ద్వంద్వ ముత్పన్న మయ్యెను. స్త్రీ పురుషులు, ప్రకృతి పురుషుడు, భోగ్యము భోక్త జడచేత నములు, సూర్యచంద్రులు నను ద్వంద్వములు మొదట జనించెననిభావము ఆ ద్వంద్వముల వలన మిగిలిన సృష్టి యేర్పడును. పరమేశ్వరుడు సృష్టి నొనరింపదలచుటయే. ఈక్షించుటయే యిట ప్రజాపతి చేసిన తపస్సుగా గ్రహింపనగును. పరమేశ్వరుడు తపించె నన ఈక్షించెను. సృష్టి రచనా క్రమము నాలోచించెను అని భావము. ఈ క్షణా నంతరము ద్వంద్వ ముత్పన్నమయ్యెను. ప్రపంచగత నానావిధసృష్టి కీ ద్వంద్వము కారణ మయ్యెను. ద్వంద్వ పూర్వకముగ సృష్టి జరిగిన దని భావము. అందు మొదటి ద్వంద్వము రయి, ప్రాణము, రయి భోగ్యము, ప్రాణము భోక్త. ఈరయి ప్రాణములను ముందువాక్యమున పిప్పలాదుడు వివరించుచున్నాడు.

"ఆదిత్యో హ వై ప్రాణో; రయి రేవ చంద్రమాః, రయిర్ వా ఏతత్ సర్వం యన్మూర్తం చామూర్తం చ తస్మా న్మూర్తి రేవ రయిః." 5

ఆదిత్యః = సూర్యుడు, ప్రాణః=ప్రాణము, హవై = ఇయ్యది ప్రసిద్ధమే, రయిః ఏవ=రయియే, చంద్రమాః=చంద్రుడు, యత్ మూర్తం చ అమూర్తంచ=ఏది స్థూలము, సూక్ష్మము నగు పదార్థముగలదో, తత్ సర్వం = అది యంతయు, వై=నిశ్చయముగా, రయిః ఏవ = రయియే–భోగ్యమే, తస్మాత్=కావున, రయిః= రయి–భోగ్యము, మూర్తిః ఏవ = మూర్తియే–స్థూలమే.

భోక్తృ భోగ్యములుగా నేర్పడిన ద్వంద్వము ఇట వివరింపబడినది, 'ప్రాణము భోక్త–రయి భోగ్యము' అని ముందు చెప్పి యిట ఆదిత్యుడు ప్రాణముగాను చంద్రుడు రయిగాను నిర్దేశింపబడిరి. సూర్యుడు అగ్ని తత్త్వము. ప్రాణుల శరీరమునందుండు ఉదరాగ్ని పదార్థములను జీర్ణింప జేయును. కావునసూర్యుడు అగ్నితత్త్వము భోక్తృశక్తిగా నిర్దేశింపబడినది. అగ్ని శరీరమున నున్నంతకాలము ప్రాణరక్షణ జరుగును. కావుననే అగ్ని తత్త్వము సూర్యుడు ప్రాణముగా చెప్పబడుటయు సముచితమగును. 'అదత్తే ప్రాణాన్ ఇత్యాదిత్యః' కాల విభాగమునకు హేతువై సర్వ పదార్థముల యాయువు నాదానముచేయును కావున సూర్యుడు ఆదిత్యు డనబడును. ప్రాణాదాత కావున ప్రాణముగా సూర్యుడు చెప్పబడె ననవచ్చును. రయి యన ధనాదులు. ప్రాణులు భోగించు పదార్థము రయి యననగును. భోగ్యపదార్థ పోషకుడు చంద్రుడు. చంద్రుని కిరణములు పదార్థములందు పోషకశక్తిని వృద్ధి చేయును. అందువలననే చంద్రుడు ప్రాణుల కాహ్లాద మును గలిగించుచు సార్థకనామము గలవాడయ్యెను. భోక్తృ భోగ్యశక్తుల నుద్దీప్తము చేయుటకు కారణములయిన ప్రాణ రయి శబ్దవాచ్య సూర్య చంద్రులను నిర్దేశించి వాని భేదమును ప్రదర్శించి, యవి రెండును నొకప్పుడు భోగ్యములే యగునని చెప్పుచున్నాడు.

ప్రపంచమున స్థూల సూక్ష్మ భేదముతో ద్వివిధములగు పదార్థములు గలవు. ఆ స్థూల సూక్ష్మ పదార్థములే మూర్తములు, అమూర్తములు

వనబడును. మూర్తిమంతములు స్థూలములు. అమూర్తములు సూక్ష్మములు. ద్వివిధములుగా నుండు నీ పదార్థములన్నియు భోగ్యములే యగును. కావుననే రయి పదవాచ్యము లగుచున్నవి. ఇట్లు సూక్ష్మపదార్థములు కూడ మూర్తములు - స్థూలము లగుచున్నవని భావము సూక్ష్మము స్థూలమెట్లు కాగలదు ? అని సందేహింప బనిలేదు. వస్తువు కారణరూపమున నున్న పుడు సూక్ష్మముగా నుండెను. అదియే కార్యరూపమున స్థూలమగును. భోక్త్రపేక్షతో భోగ్య మెప్పుడును స్థూలమే. భోక్త పురుషుడు, చేతన తత్త్వము. అది సూక్ష్మము. భోగ్యము ప్రాకృతికము - అది స్థూలమే యనుట మఱవరాదు. కావున ప్రజాపతి తన యీక్షణమూలమున ప్రథమమున స్థూల జగత్తునందు, భోక్తృ భోగ్యశక్తి వర్ధకములయిన సూర్య చంద్రుల నుదయింపజేసెనని పిప్పలాదుడు నుడివెను.

"సూర్యా చంద్రమసౌ ధాతా యథా పూర్వ మకల్పయత్"
అను మంత్రవర్ణము లీ విషయమునే వర్ణించుచున్న వనవచ్చును.

> "అథాదిత్య ఉదయన్ యత్ ప్రాచీం దిశం ప్రవిశతి తేన ప్రాచ్యాన్ రశ్మిషు సన్నిధత్తే, యద్దక్షిణాం యత్ ప్రతీచీం యదుదీచీం యదధో యదూర్ధ్వం యదంతరా దిశో యత్ సర్వం ప్రకాశయతి తేన సర్వాన్ ప్రాణాన్ రశ్మిషు సన్నిధత్తే."

అథ=రాత్రిగడచిన తదుపరి, ఆదిత్యః=సూర్యుడు. ఉదయన్ = ఉదయించుచు, యత్ = ఎందువలన, ప్రాచీందిశం = పూర్వదిశయందు, ప్రవిశతి=ప్రవేశించునో - తన కాంతితో వ్యాపించునో, తేన = ఆ కారణముచే, ప్రాచ్యాన్ ప్రాణాన్=పూర్వదిశ యందున్న ప్రాణములను, భోక్తృ శక్తులను, రశ్మిషు = తన కిరణములతో, సన్నిధత్తే = సంయుక్తము చేయును. అట్లే, యత్ దక్షిణాం=దక్షిణమునను, యత్ ప్రతీచీం=పశ్చిమమునను, యత్ ఉదీచీం=ఉత్తరమునను, యత్ అధః యత్ ఊర్ధ్వం =

క్రిందుమీదులను, యత్ అంతరాఃదిశః = దిక్కోణములను, యత్ సర్వమ్ =మిగిలిన సమస్త దిగ్ భాగములను, ప్రకాశయతి=ప్రకాశింప జేయునో, తేన=అకారణముచే, సర్వాన్ ప్రాణాన్=సమస్త భోక్తృ శక్తులనుగూడ, రశ్మిషు సన్నిధత్తే=స్వకిరణములతో సంయుక్తము చేయును.

సూర్యు డుదయించి యన్ని దిక్కులందును తన కిరణములను ప్రసారముచేయుటవలన నా ప్రకాశమును బొందిన ప్రాణులలో గల భోక్తృ శక్తి వర్ధిల్లును. ఇందు ప్రయోగింపబడిన ప్రాణశబ్దము భోక్తృశక్తిగా గ్రహింపనగును. ప్రాణుల యుదరమునందలి జాఠరాగ్ని యని చెప్పిన మిక్కిలి బాగుగ నుండును. జాఠరాగ్నియే భోక్తృశక్తి. అది బాగుగ నున్నంతకాలము ప్రాణులు తామనుభవించు పదార్థములను చక్కగ జీర్ణింప జేసికొనును. పగలు ఎక్కువ యాకలి యగుటకు కారణము సూర్యరశ్మి సంబంధమే యగును. కావున ప్రాణమన నిట భోక్తృశక్తియే కాని, హృదయ స్థానమున నుండు శరీరగత వాయువు కాదు.

"స ఏష వైశ్వానరో విశ్వరూపః
ప్రాణోఽగ్ని రుదయతే, త దేతద్ ఋచాభ్యుక్తమ్." ౭

సః=ఆయాదిత్యుడు, ఏషః = ఈ లోకసిద్ధుడగు, వైశ్వానరః = విశ్వప్రాణులను నడపువాడు - తన ప్రకాశముచే సమస్త ప్రాణులు స్వ వ్యాపారములందు నిమగ్నులగునట్లు చేయువాడు, (విశ్వమును నడపు వాడు విశ్వానరుడు విశ్వానరుడే వైశ్వానరుడు.) విశ్వరూపః=స్వతేజస్సు ద్వారమున సర్వభోక్తృ శక్తిస్వరూపు డగుచున్నాడు. ప్రాణః = జీవన హేతువు, అగ్నిః=దహింపజేయువాడు, ఉదయతే=ఉదయించుచున్నాడు, తత్ ఏతత్ = ఈ యుపన్యస్త విషయమే, ఋచా అభ్యుక్తమ్ = ఋగ్వేద మంత్రముచే జెప్పబడినది.

సూర్యోదయ మగుటయే తడవుగా లోకములన్నియు ప్రకాశముతో గూడినవగును. దశ దిశలు వెలుగుతో నుండును. ప్రాణులు రాత్రియందు

నిద్రించి నిశ్చేష్టులై యుండును. సూర్యోదయమయి సూర్యకాంతులు దిశల వ్యాపింప నెల్లరు తమతమ కార్యములందు వ్యాపృతు లగుదురు. ప్రాణులకు బుభుక్షయు నేర్పడును. అన్నాదులను గ్రహింప దొడగును ప్రాణులను సచేష్టులంజేసి, వారిలోగల భోక్తృశక్తిని ఉద్దీపింపజేసి ప్రపంచమును నడపుటకు హేతువగుటచే సూర్యుడు విశ్వానరుడును, కాంతులతో విశ్వమును వ్యాపించి విశ్వరూపుడు, దాహకశక్తి గలవాడై యగ్నియు, జీవన హేతువై ప్రాణము ననిపించుకొనుచున్నాడని భావము. ఈ భావమునే ఋగ్వేదమంత్రము కూడ చెప్పుచున్నదని మంత్ర ప్రమాణమును జూపుచున్నాడు. పూర్వపు ఋషులు వేదమును పరమ ప్రమాణముగ నంగీకరింతురు కదా!

('తదేతద్ ఋచా అభ్యుక్తమ్' అను నీయుపనిషద్వాక్యము (మూలమున) ఋక్కును ప్రమాణీకరించుచున్నది. దీనింబట్టి ఋగ్వేదాది మంత్రములు వేఱనియు, ఉపనిషత్తులు వేదములు కాని, వేదాంతము పేరుతో వేద భాగములు కాని కావని స్పష్టమగుచున్నది. ఉపనిషత్తు స్వయముగా వేదమగుచో వేదమంత్రమును తా జెప్పిన విషయమును ధృవపఱచుట కేల ప్రమాణీకరించును? ప్రమాణీకరింపదు.)

"విశ్వరూపం హరిణం జాతవేదసం పరాయణం జ్యోతి రేకం తపంతమ్, సహస్రరశ్మిః శతధా వర్తమానః ప్రాణః ప్రజానా ముదయ త్యేష సూర్యః." ౮

సహస్రరశ్మిః=అసంఖ్యాకములయిన కిరణములు గలవాడు, శతధా వర్తమానః=భోక్తృశక్తులందు అనేక విధముల తన తేజస్సుతో వర్తించు వాడు, ప్రజానాం ప్రాణః = ఉత్పన్నప్రాణులకు జీవనహేతువు నగు, ఏషః = ప్రత్యక్షమగు నీ, సూర్యః=సూర్యుడు, ఉదయతి = ఉదయించు చున్నాడు, విశ్వరూపం=సర్వభోక్తృశక్తిమయుడును, హరిణం=కిరణవంతుడును, జాతవేదసం=రూపమునకు శోభకు నుత్పత్తిస్థానమైనవాడును,

పరాయణం=ప్రాణుల కాశ్రయుడును, తపంతం=తపించువాడును, ఏకం=ఒక్కడును. జ్యోతిః=ప్రకాశమయుడునగు నట్టి సూర్యుని విద్వాంసులు యథార్థముగా నెఱుగుదురు.

ఈ ఋక్కునందు "సహస్రరశ్మి మున్నగు విశేషణములు గలిగిన సూర్యుడు ఉదయించి, తన కిరణములతో నన్ని యెడల వ్యాపించి ప్రాణులలో చైతన్యము నుత్తేజింపజేసి, భోక్తృత్వాది శక్తులను పెంపుజేసి స్వస్వ వ్యాపారములందు నిమగ్నులం జేయును. లోకజీవనమునకు హేతువగును." అను విషయము ప్రతిపాదింపబడినది.

(పిప్పలాదుడు తాను సుకేశాదులకు జెప్పిన విషయమును బలపఱచుటకై యీ ఋఙ్మంత్రము నుదహరించి యున్నాడు. కాని, యీ మంత్రమునగల విశ్వరూపుడు, పరాయణుడు, జాతవేదుడు మున్నగు విశేషణముల నూతగాగొని మాయావాదులు సర్వాత్మవాదమును - అంతయు సూర్యుడే యను వాదమును సాధింప జూతురు. అది సమంజసముకాదు. ప్రజాపతి సూర్యచంద్రుల నుత్పన్నముచేసినట్లు ప్రకరణారంభమున నుపనిషత్తు చెప్పియుండగా నది యెట్లు సంభవమగును? విశ్వరూపాది విశేషణ విశిష్టుడగు సూర్యు నుత్పన్న మొనర్చిన ప్రజాపతి (పరమేశ్వరుని) మహత్వము నిట నూహించి, యతని సాక్షాత్కారమునకై యత్నించుట విద్వాంసుల కర్తవ్యముగా నెంచవలయును.)

"సంవత్సరో వై ప్రజాపతి స్తస్యాయనే దక్షిణం చోత్తరం చ, తద్యేహ వై తదిష్టాపూర్తే కృత మిత్యుపాసతే, తే చాంద్రమస మేవ లోక మభిజయంతే, త ఏవ పున రావర్తంతే, తస్మా దేత ఋషయః ప్రజాకామా దక్షిణం ప్రతిపద్యన్తే, ఏష హ వై రయిర్ యః పితృయాణః.

సంవత్సరః=కాల విభాగరూప సంవత్సరము, వై=నిశ్చయముగ, ప్రజాపతిః=ప్రజలను పాలించునది, తస్య=ఆసంవత్సరమునకు, దక్షిణం చ

ఉత్తరం చ=దక్షిణము, ఉత్తరము నను రెండు, అయనే=భాగములు, తత్=ఆ రెండు అయనములలో, యే హ వై=ఎవరు, తత్ ఇష్టాపూర్తే= వైదిక యజ్ఞాదిరూప ఇష్టమును, వాపీ కూప తటా కాది నిర్మాణరూపమగు పూర్తమును, కృతమ్=ఆచరించి నందువలన వాని ఫలము తమకు తప్పక లభించునను బుద్ధితో, ఉపాసతే = ఉపాసింతురో _ వాని నాచరింతురో, తే=వారు, చాంద్రమస మేవ=భోగ్యశక్తి ప్రధానమగు-మూర్తరూపమగు లోకమ్=స్థాన శరీరాదులను, అభిజయంతే=జయింతురు-సంపాదింతురు, తే ఏవ=అభోగాసక్త మనస్కులే, పునః ఆవర్తంతే=లోకమున మాటి మాటికి జన్మింతురు - పునర్జన్మలను బొందుదురు. తస్మాత్ = కావున, ఏతే=వీరు, ప్రజాకామాః=సంతానాదుల నపేక్షించువారై, దక్షిణం=దక్షిణ మార్గమును, ప్రతిపద్యంతే=పొందుదురు. యః పితృయాణః=ఏది పితృ యాణమో, ఏషః హవై రయిః=అదియే రయి - భోగ్యము.

ఇట భోక్తృ భోగ్య (భోక్తా - భోగ్యము) శక్తులలోగల భేదమును ప్రదర్శింపదలచి పిప్పలాదు డనుచున్నాడు. కాలవిభాగమునకు హేతువులు సూర్యచంద్రులు, ఇయ్యవి రెండును పరమేశ్వరునిచే నుత్పన్నమైనట్లు పూర్వమే చెప్పబడినది సూర్యచంద్రుల మూలమున నేర్పడు కాలము, సంవత్సరాదులు సృష్టి రక్షణకు హేతువు లగుటచే ప్రజాపతిగా వర్ణింప బడినవి. సంవత్సరమును ఉత్తర దక్షిణ నామములతో రెండు అయనము లుగా విభజించి వ్యవహరించుట లోకసిద్ధ విషయమే. అం దుత్తరాయణము ఆఱు మాసములు ఉత్కృష్టముగను, దక్షిణాయనము ఆఱు మాసములు నికృష్టముగను సాహిత్యమున వ్యవహరింప బడుటయు పాఠకులకు తెలి యును, భోక్తృ భోగ్యాత్మక మగు నీ ప్రపంచమున నెవరు వేదవిహిత యజ్ఞాది కర్మల ఫలాపేక్షతో నాచరింతురో, వాపీ కూప తటా కాదులను త్రవ్వించుట, ఆ రామముల నిర్మించుట, ధర్మశాలల నేర్పఱచుట, అనాధ శరణాలయముల నిర్మించి దిక్కులేని వారిని పోషించుట మున్నగు ధర్మ

కార్య (పూర్త) ముల నాచరింతురో యట్టివారు మిక్కిలిగ భోగ్యములగు సుఖముల ననుభవించుటకు వీలైన స్థాన శరీరములను, వస్తువాహనాదులను సంపాదింప గలుగుదురు. అట్టివారే మాటిమాటికి జన్మ మరణముల ననుభవింతురు. వారు ఉత్కృష్ట మార్గము ననుభవించువారు కారు. జన్మ జరా మరణరూప దుఃఖముల ననుభవించుట శ్రేష్ఠము కాదుగదా! అట్లు కాక వేదవిహిత సత్కర్మలను నిష్కామ బుద్ధితో నాచరించి, జ్ఞానము నార్జించి క్రమముగా జన్మ జరామరణాది దుఃఖములనుండి దూరమగుటకై యత్నించుట యుత్తమ మార్గమగును ఈ ద్వివిధములగు ప్రవృత్తులే-మార్గములే ఉత్తర దక్షిణాయనము లనియు, దేవయాన పితృయాణములనియు నుడువబడును. ఇయ్యవి సంవత్సర భాగములతో బోల్చి వర్ణింతురు. ఉత్తరాయణము భోక్తృశక్తి ప్రధానమైనది. అందు సూర్యుడు ప్రకాశించు పగటికాల మెక్కువగుచు నుండును. ప్రకాశము జ్ఞాన సుఖ సూచకము. ఇక దక్షిణాయనమున రాత్రికాల మెక్కుడగును. ప్రకాశరహితకాల మెక్కువగునని భావము. కావున నయ్యది ఉత్తరాయణము కంటె నికృష్ట మందురు. దక్షిణాయనము కంటె ఉత్తరాయణము ప్రకాశాధిక్యము వలన ఉత్కృష్టమనియు నెంచబడు చున్నది. మనుజుల ప్రవృత్తిని బట్టి భోగపరాయణులై కాలము నయించువారు పితృయాణగాము లనియు, నివృత్తిపరులై విషయ వాంఛలకు దూరులగుచు జ్ఞానప్రాప్తికై యత్నించువారు క్రమముగా నౌన్నత్యమును సాధించు దేవయానగతు లనియు నెంచబడుదురు.

"అథోత్తరేణ తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా విద్యయా ఽఽత్మాన మన్విష్యాదిత్య మభిజయన్తే, ఏతద్వై ప్రాణానా మాయతన మేత దమృత మభయ మేతత్ పరాయణ మేత స్మాన్న పున రావర్తన్త ఇత్యేష నిరోధ స్తదేషశ్లోకః." ౧౦

అథ=అనంతరమున, ఉత్తరేణ=ఉత్తమమైన ఉత్తరాయణముతో, తపసా = తపస్సుతో, బ్రహ్మచర్యేణ = బ్రహ్మచర్యముతో, శ్రద్ధయా =

శ్రద్ధతో, విద్యయాచ=విద్యతోను, ఆత్మానం=పరమేశ్వరుని, అన్విష్య= తెలిసికొని, ఆదిత్యం = భోక్తృ స్వరూపమగు తనను, అభిజయంతే = వశపఱచుకొందురు, ఏతత్ వై = ఈ యాత్మయే (భోక్తృ స్వరూపమే), ప్రాణానాం=ప్రాణములకు, ఆయతనమ్=స్థానము - అధిష్ఠానము, ఏతత్ =ఈభోక్తృ స్వరూపమగు ఆత్మ, అమృతమ్=నాశములేనిది, అభయమ్ = భయములేనిది, ఏతత్ పరాయణమ్=ఇదియే పరమగతి, ఏతస్మాత్ = ఇందువలన, న పునః, ఆవర్తన్తే=మరల మరల జన్మింపరు, ఇతి ఏషః= ఇదియే, నిరోధః = నిరోధమునకు హేతువు, తత్ ఏషః శ్లోకః = భోక్తృ శక్తిని ప్రతిపాదించు శ్లోక మిది

ఉత్తరాయణమునందు భోక్తృశక్తి వర్ధిల్లును జ్ఞానము పెంపగును. జ్ఞానము నుపాసింప దలచువారు భోగ్యపదార్థములందాసక్తిని విడిచి, తపస్సు నాచరింతురు. చాంద్రాయణాది కష్టకర వ్రతముల నాచరింతురు, శీతోష్ణాది ద్వంద్వములను సహింతురు. సుఖ దుఃఖములకు లోనై వికారముల నందరు. హర్ష శోకములను, మానావమానములను, హాని లాభములను సమములుగా ననుభవింతురు. బ్రహ్మచర్యము - ఉపస్థేంద్రియనిగ్రహము గలవా రగుదురు. సత్యనిష్ఠులై వేదవిజ్ఞానమును సంపాదింతురు. ఇట్టి విశిష్టమగు ప్రవృత్తి కలవారై - లేక, నివృత్తి మార్గము ననుసరించుచు క్రమముగా పరమేశ్వరుని సాక్షాత్కార మొనర్చు కొందురు పరమేశ్వరుని సాక్షాత్కారమునకు ముందు వారు తమ స్వరూపమును గుర్తింతురు. ఆత్మ నెఱుగని వానికి పరమేశ్వరుని సాక్షాత్కారము కలుగదు. యమ నియమాది తపశ్చరణము వలన చిత్తము ప్రసన్నమై, విక్షేపములేని దగును. సమాహిత మగును. ఇట్టి చిత్త నిరోధము వలన భోక్త-జీవుడు తన స్వరూపమును ప్రకాశాత్మకముగా జూచును- తెలిసికొనును. వానికి భయముండదు - వాని వలన నితరులకు భయము కలుగదు. క్రమముగా వానికి నిర్వికారము, నిర్మలము, నిత్యము, శుద్ధము, సర్వ జీవన హేతువు, ప్రాణులకు పరాయ

ణము, పరమగతియు నగు పరమాత్మ సాక్షాత్కారము కలుగును. అట్టివారు ఇతర సాధారణ-ప్రాకృత జనులవలె మాటిమాటికి జన్మ మరణములననుభవింపరు. ముక్తులై బ్రహ్మానందమును పరాంతకాలము వఱకు ననుభవింతురు.

(భోగ్యాసక్త మనస్కులు - విషయ సుఖములకు లోనగువారు ప్రకృతి బద్ధులై తమ్మునుతామే గుర్తింపజాలరు - స్వాత్మజ్ఞానమే వారికి గలుగదు. ఇక పరమాత్మజ్ఞాన మెట్లు కలుగగలదు? జీవాత్మ జ్ఞానము కలుగని వారికి పరమాత్మజ్ఞానము కలుగనేర దని భావము. కావుననే "తమ్ ఆత్మస్థం యేఽనుపశ్యంతి ధీరా స్తేషాం సుఖంశాశ్వతమ్ నేతరేషామ్" "ఆ యాత్మస్థుడైన పరమాత్మను 'అనుపశ్యంతి' అను దర్శనము చేసికొను వారికి శాశ్వత సుఖము - ఆనందము లభించును కాని యితరులకు లభింపదు" అని మహర్షులు నుడివియున్నారు. ఇట 'అను పశ్యంతి' అను క్రియాపదము గమనింప దగినది. 'పశ్యంతి' అనగా చూతురు - తెలిసి కొందురు. 'అను పశ్యంతి' అనగా తరువాత చూతురు. తెలిసికొందు రని యర్థము. తరువాత ననగా తన స్వరూపము నెఱిగిన తరువాత నని యర్థము. కాబట్టి ఆత్మజ్ఞానము కలుగని వారికి పరమాత్మ జ్ఞానము కలుగదనుట నిశ్చితము)

ముందు రాబోవు శ్లోకము భోక్తృశక్తిని గూర్చి బోధించును

"పంచపాదం పితరం ద్వాదశాకృతిం దివ ఆహుః పరే అర్ధే పురీషిణమ్, అథ మే అన్య ఉ పరే విచక్షణం సప్త చక్రే షడర ఆహు రర్పిత మితి" ౧౧

పంచపాదం = ఐదు పాదములు గలిగినట్టియు, ద్వాదశాకృతిం = పండ్రెండు ఆకృతులు గలిగినట్టియు, పురీషిణం = జలమునకు హేతువైనట్టియు, దివః=దివమునకు, పరేఅర్ధే=పరమైన యర్ధభాగమున నుండు నట్టియు, పితరం=జనకుడు నగు (సూర్యునిగూర్చి) ఆదిత్యుని, ఆహుః= విద్వాంసులు నుడువుదురు, అథ ఉ ఇమే అన్యే=మఱి యితర విద్వాంసులు

కొందఱు, షళరే=ఆఱు అకులుగలిగి, సప్తచక్రే = ఏడు చక్రములుగల, సంవత్సరరూప కాలమున, విచక్షణం=బాగుగ వస్తువులను ప్రకాశింప జేయునట్టి సూర్యుని, అర్పితమ్=సంలగ్నుడై యున్నవానినిగ, ఆహుః = చెప్పుదురు.

ఇంతకు పూర్వము (సంవత్సరో వై ప్రజాపతిః) సంవత్సరమే ప్రజాపతి యని చెప్పబడినది. సంవత్స రాది కాల విభాగమునకు ముఖ్య హేతువైనందున భోక్తృశక్తి ప్రధానుడగు సూర్యుడు సంవత్సరరూపమున వ్యాఖ్యాన మిందు చేయబడినది. సూర్యుడు లేకున్న సంవత్సరాది కాల విభాగము సంభవము కాదు రాత్రింబవళ్ళు, దిన వార, పక్ష, మాస, ఋతు అయనాది వ్యవహార మంతయు సూర్యునిపై నాధారపడి యుండుటచే సూర్యుడు సంవత్సర రూపమున నిట వర్ణింపబడుట యసంగతము కాదు. సూర్యుడు భోక్తృశక్తిగా ని దివఱకే చెప్పబడియున్నాడు. సూర్యునివలననే ప్రాణులలో భోక్తృశక్తి పెఱుగు ననియు వివరింపబడినది. అట్టి భోక్తృశక్తి ప్రధానత సూర్యుని కారణమున సంవత్సరమునందును నారోపింప బడుట యనుచితము కాదు.

సంవత్సరమునకు ఐదుపాదములు, పండ్రెండు అవయవములు — ఆకృతులు నని యిట వర్ణింపబడినవి. వసంతాది షత్ ఋతువులే పంచ పాదములు. ఋతువులు ఆఱు, కావున నాఱుపాదము లనవలసినది. కాని, హేమంత శిశిరములను కలిపి యొకే ఋతువుగా ఎంచి పంచ పాదములుగ వర్ణింపబడినది పండ్రెండు మాసములు సంవత్సరము. సూర్యునకు పండ్రెండాకృతులు. పురీష మనగా జలము. జలముతో సూర్యున కెంతో సంబంధమున్నది. సూర్యుని వలననే జలము వర్షరూపమున లభించును. 'ఆదిత్యా జ్జాయతే వృష్టిః' ఆదిత్యుని వలననే వర్ష మేర్పడును. ఇది యెల్ల రెఱిగిన విషయమే. కావున ఆదిత్యుడు పురీషి. సూర్యుడు దివమున నుండి సంవత్సరాదులకు కారణమై లోకపాలకు డగు చున్నందున నతడు

పిత-పాలకుడు-జనకుడు అని విద్వాంసులచే జెప్పబడుచున్నాడు. కొందఱు విద్వాంసులు సంవత్సరములోని షడృతువులు చక్రమునందలి ఆకుల పంటివిగాను, భూర్ భువాది సప్తలోకములు చక్రములు తిరుగునట్లు భ్రమణ స్వభావము గలవిగాను వర్ణింతురు. మఱియు సూర్యుడు దివమునందు లోకములను ప్రకాశింపజేయుట కర్పితమైయున్న జెంచుచున్నారు. ప్రజాపతి యగు పరమేశ్వరునిచే నుత్పన్నము చేయబడిన సంవత్సరాత్మక సూర్యుని వలన లోకము లుత్పన్నములై పోషింపబడు చున్నవి. భోక్తృ భోగ్య రూప నరనారీ సంబంధ సంయోగాదులవలన ప్రజలు-సంతానము ఏర్పడుట మనము నిత్యము చూచుచున్నాము ఇది యంతయు ప్రజాపతి సృష్టియే.

"మాసో వై ప్రజాపతి స్తస్య కృష్ణపక్ష ఏవ రయిః శుక్లం ప్రాణః, తస్మా దేతే ఋషయః శుక్ల ఇష్టం కుర్వం తీతర ఇతరస్మిన్." ౧౨

మాసః వై=మాసము కూడ, ప్రజాపతిః=ప్రజాపతి యే, తస్య = ఆ మాసమునకు, కృష్ణపక్షః ఏవ = కృష్ణపక్షమే, రయిః = భోగ్యము-భోగ్యశక్తి ప్రధానమైనది, శుక్లః=శుద్ధపక్షము, ప్రాణః = ప్రాణము-భోక్తృశక్తి ప్రధానమైనది, తస్మాత్=అందువలన, ఏతే ఋషయః = మంత్రద్రష్ట లయిన మహర్షులు, శుక్లే = శుక్లపక్షమునందు, ఇష్టిం కుర్వంతి=ఇష్టిని - యాగాదికమును చేయుదురు. ఇతరే = (వేదార్థము నెఱుగని) ఇతరులు, ఇతరస్మిన్ = కృష్ణపక్షమున యజ్ఞాదికములు నాచరింతురు.

పూర్వము సంవత్సరమును గూర్చి వర్ణింపబడినది. ఆ సంవత్సరమునకు మాసము లవయవములు. వానివలననే యది యేర్పడును సంవత్సర రూపమున భోక్తృశక్తిని వర్ణించి, తదవయవమగు మాసరూప భోక్తృశక్తి యిట జెప్పబడుచున్నది. మాసమునందు శుక్ల కృష్ణ నామములతో రెండు పక్షము లుండును. శుక్లపక్షమున రాత్రియందును. ప్రకాశ

మధికమగు చుండును. సూర్యుడు తద్రూపమున భోక్తృశక్తిని వర్ధిల్ల జేయును. జీవనము ప్రకాశవంతమగును. కావున శుక్లపక్షమునందు వేదజ్ఞులయిన ఋషులు సత్కర్మల నొనర్చి జ్ఞానమును పెంపుచేసికొందురు. కృష్ణపక్షమునందు చీకటి వర్ధిల్లును ప్రాణులు భోగపరులగుదురు కృష్ణ పక్షము భోగాసక్తిని పెంచి ప్రాణులందు జ్ఞాన నిరోధమును కలిగించును. అట్టి ప్రాణులు శుక్లపక్ష మహిమను గుర్తింపరు.

"అహో రాత్రో వై ప్రజాపతి స్తస్యాహ రేవ ప్రాణో రాత్రి రేవ రయిః, ప్రాణం వా ఏతే ప్రస్కందంతి యే దివా రత్యా సంయుజ్యంతే; బ్రహ్మచర్య మేవ తద్ యద్ రాత్రౌ రత్యా సంయుజ్యంతే." ౧౩

అహోరాత్రః వై=దివారాత్రములుకూడ. ప్రజాపతిః = ప్రజారక్షకములే, తస్య=ఆయహోరాత్రమునకు అహః ఏవ=అహస్సు - పగలే. ప్రాణః=ప్రాణము, రాత్రిః ఏవ=రాత్రియే, రయిః=రయి, యే=ఎవరు, దివా=పగటియందు, రత్యా సంయుజ్యంతే = స్త్రీసంయోగము నొనర్తురో, వై =నిశ్చయముగ, ఏతే=వారు, ప్రాణం ప్రస్కందంతి = జీవనహేతువగు ప్రాణశక్తిని శోషింపజేయుదురు - నశింపజేయుదురు, యత్రాత్రౌ రత్యా సంయుజ్యంతే = రాత్రియందు స్త్రీ సంగమ మొనర్చుట యనునది, తత్ బ్రహ్మచర్యమేవ=బ్రహ్మచర్యమే యగును.

మాసమునకు దినరాత్రు లంగములు. వానితో నది యేర్పడును. అందు దినము ప్రకాశాత్మకము - జీవనహేతువు. భోక్తృశక్తి వర్ధకము. రాత్రి అంధకార ప్రధానము. అందు భోగాసక్తి వర్ధిల్లును. ఈ రాత్రిం దివములు రెండు ప్రజాపోషకములే. కావున ప్రజాపతి పదవాచ్యము లగుచున్నవి. కాని, పగటివేళ నొనర్చు మైథునము ఉష్ణాధిక్యాది కారణముగ ప్రాణశోషకము కాగలదు. కావున పగటి స్త్రీ పురుష సంగమము నిషిద్ధము. రాత్రియం దొనర్చు మైథునము జీవనశక్తికి హాని కలిగింప నందున బ్రహ్మ

చర్యమే యగును. రాత్రియందును మైథున సమయమున ప్రకాశము వాంఛనీయము కాదని విజ్ఞు లభిప్రాయ పడుదురు.

"అన్నం వై ప్రజాపతి స్తతో హ వై తద్రేత
స్తస్మా దిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి" ౧౪

అన్నం వై = అన్నము - తినుబండారము - సస్యపక్వఫలము - తండులాది ధాన్యములు కూడ, ప్రజాపతిః = ఉత్పన్నప్రాణుల పోషక పదార్థమే, తతః హ వై = అ యన్నమువలననే, తత్ రేతః = ప్రాణుల యుత్పత్తికి హేతువగు రేతస్సు - వీర్యము జనించును, తస్మాత్ = స్త్రీ గర్భమున జేర్పబడిన యారేతస్సు వలననే, ఇమాః ప్రజాః ప్రజాయంతే= ఈ మనుష్యాది ప్రజలు - ప్రాణులు జనింతురు.

అన్నముకూడ ప్రజాపతి - ప్రజాపాలకరూపమే తండుల గోధూమాది ధాన్యాదుల భక్షణముననే శరీరమునందు రేతస్సు ఏర్పడును. అదియే సంతానహేతువు. తైత్తిరీయమునందుకూడ 'అన్నాద్ రేతః రేతసః పురుషః' అన్నము వలన రేతస్సు, దానివలన ప్రాణి - పురుషుడు నేర్పడునని వర్ణింపబడినది.

"తద్యే హ ప్రజాపతివ్రతం చరంతి తే మిథున ముత్పాద
యంతే, తేషా మేవైష బ్రహ్మలోకో యేషాం తపో బ్రహ్మ
చర్యం యేషు సత్యం ప్రతిష్ఠితమ్." ౧౫

తత్=అందువలన, యేహ=ఎవరు, ప్రజాపతివ్రతం=ప్రజాపాలక వ్రతమును, చరంతి=ఆచరింతురో, తే=వారు, మిథునమ్=భోక్తృ భోగ్య రూప - స్త్రీ పురుషరూప సంతానమును, ఉత్పాదయంతే = జనింపజేయుదురు, యేషాం = ఎవరి, తపః = తపస్సు. బ్రహ్మచర్యం=ఉపస్థేంద్రియ నిగ్రహమో, యేషు=ఎవరియందు, సత్యం = సత్యధారణము, ప్రతిష్ఠితం= స్థిరముగానుండునో, తేషామ్ ఏవ = వారికే, ఏషః బ్రహ్మలోకః = ఈ బ్రహ్మదర్శనము.

ప్రజాపతి వ్రతము నాచరించువారు సుసంతానవంతు లగుదురు. వారు జితేంద్రియులై బ్రహ్మచర్యాది వ్రతములను బాలింతురు. నియమ పూర్వకముగ సంతానాపేక్షతో స్వస్త్రీయందే వీర్యసించనము చేయుచు నుండువారు బ్రహ్మచర్యమును కాపాడినవారే యగుదురు. అట్టి వారికి చక్కని బాల బాలికలు కలుగుదురు. వారు సత్యవ్రతులు, క్రమముగా బ్రహ్మజ్ఞానమును సంపాదింతురు. ఇతరులకు-వ్యత్క్రమ జీవితము నడపువారి కా యోగ్యత కలుగదని భావము.

"తేషా మసౌ విరజో బ్రహ్మలోకో
న యేషు జిహ్మ మనృతం న మాయా చేతి." ౧౬

యేషు=ఎవరియందు, జిహ్మం=కుటిలత, అనృతం=అసత్యము, న=ఉండదో, న చ మాయా = మోసము నుండదో, తేషాం = వారికే, అసౌ విరజః=ఈ శుద్ధమైన, బ్రహ్మలోకః=బ్రహ్మదర్శనము కలుగును.

అభిమానము, అసూయ, మాత్సర్యాది దోషములవలన మనుజులు కుటిలు లగుదురు కౌటిల్యము (జిహ్మము) నకు అభిమానాదులు హేతువులు. అంతఃకరణమున తా దలచిన దానికి విరుద్ధముగా జెప్పుట -వర్తించుట మాయ యగును నిషిద్ధముల నాచరించుట-ఉన్నది యున్నట్లు చెప్పక విపరీతముగ చెప్పుట, అగమ్య గమనాదుల నొనర్చుట యనృతమగును. జిహ్వ మాయానృతాది దోషములతోగూడి లోకమున వర్తించు వారికి నిర్మలమగు బ్రహ్మజ్ఞానము కలుగదు. ఇట్టి దోషముల నంటక పూర్వోక్త ప్రజాపాలక బ్రహ్మచర్యాది వ్రతములను సత్యనిష్ఠతో నాచరించు వారు నిత్యశుద్ధబుద్ధ ముక్తమగు బ్రహ్మమును సాక్షాత్కారము చేసికొని తరింతురు-ముక్తులగుదురు-బ్రహ్మానందము నందుదురు. అని కాత్యాయనుడు కబంధు డడిగిన ప్రథమ ప్రశ్నకు పిప్పలాదమహర్షి సమాధానము నుడివెను.

మూల వాక్యాంతమున నున్న 'ఇతి' పదము ప్రథమ ప్రశ్న సమాప్తిని తెలుపును.

ద్వితీయః ప్రశ్నః

"అథ హైనం భార్గవో వైదర్భిః పప్రచ్ఛ
భగవన్! కత్యేవ దేవాః ప్రజాం విధారయంతే
కతర ఏతత్ ప్రకాశయంతే
కః పున రేషాం వరిష్ఠ ఇతి." ౧

అథ = తరువాత, భార్గవః వైదర్భిః=భృగు వంశజుడగు వైదర్భి. ఏనం హ=పిప్పలాద మహర్షిని. పప్రచ్ఛ=అడిగెను, భగవన్=స్వామీః, కతిఏవదేవాః=ఎన్ని దేవతలు, ప్రజాం = ప్రజను, విధారయంతే = విశేష రూపమున దరించుచున్నవి, కతరే=ఆరెంటిలో నెయ్యవి, ఏతత్ ప్రకాశయంతే=ఇట్లు ప్రకాశింపజేయును?, ఏషాం = వీనిలో, పునః కః వరిష్ఠః= ఎయ్యది సర్వోత్తమ దేవత?, ఇతి=అని ప్రశ్నించెను,

కాత్యాయనుడు కబంధు డడిగిన ప్రథమ ప్రశ్నకు సమాధానము చెప్పిన తదుపరి. భృగుగోత్రోద్భవు డగు వైదర్భి పిప్పలాద మహర్షి నిట్లు ప్రశ్నించెను 'అయ్యా! లోకమున ప్రజాపతిచే నుత్పన్నము చేయబడిన శరీరాది రూపమగు ప్రజను - సృష్టిని ఎన్ని దేవతలు- జ్ఞానేంద్రియాదులు ధరించుచున్నవి? వ్యవహార సమర్థము చేయుచున్నవి? శరీరమునందు జ్ఞాన కర్మభేదముతో ద్వివిధములైన యింద్రియము లున్నవికదా ! ఆ రెండు విధములగు నింద్రియములలోను నే యింద్రియ సమూహ మీశరీరవ్యవహారమును విశేషముగ నిర్వహించుచున్నది? అందునను సర్వోత్తమ మగు నింద్రియ మెయ్యది? ఇయ్యది ప్రశ్న స్వరూపము.

మొదటి ప్రశ్నకు సమాధానముగ పిప్పలాదుడు భోక్తృశక్తిప్రధానమైన ప్రాణ మహత్వమును, దాని యనేక రూపతను నుడివియుండెను. ఆ విషయము నింకను స్పష్టపఱచుటకు, ధృవపఱచుటకును అనువగు నట్లు వైదర్భి యీ రెండవ ప్రశ్నము నారంభించెను. లోకమున సృష్టింపబడిన

శరీరాదుల స్థితియే సృష్టిస్థితి యగును. శరీరమున నేత్రాదిజ్ఞానేంద్రియములు వాగాది కర్మేంద్రియములు నున్నవి. ఈద్వివిధేంద్రియముల ద్వారమున శరీరవ్యాపారము నిర్వర్తింపబడును. వీనిలో నెయ్యవి ముఖ్యములు? సర్వేంద్రియములలోను నెయ్యది యత్యంత శ్రేష్ఠము? ఈసృష్టిలో నేయే శక్తులు పనిచేయుచున్నవి? దీనిస్థితి కేయది ముఖ్యము? అని ప్రశ్నాభిప్రాయము.

"తస్మై స హోవా చాకాశో హ వా ఏష దేవో
వాయు రగ్ని రాపః పృథివీ వాఙ్మన శ్చక్షుః శ్రోత్రం చ
తే ప్రకాశ్యాభివదంతి వయ మేతద్
వాణ మవష్టభ్య విధారయామః." 2

తస్మై=అవైదర్భునకు, సః = ఆ పిప్పలాదుడు, హ ఉవాచ = ఇట్లు చెప్పెను, హవై = నిశ్చయముగ, ఏషః దేవః ఆకాశః = ఈ ప్రకాశించు ఆకాశము వాయుః = వాయువు, అగ్నిః=అగ్ని. ఆపః = జలము, పృథివీ= భూమి, వాక్=వాక్కు, మనః = మనస్సు, చక్షుః = నేత్రము శ్రోత్రం చ=చెవి మొదలయినవి, తే=ఇవియన్నియు, ప్రకాశ్య = తమ శక్తిని ప్రకటించి, వయమ్ = మేము, ఏతత్ వాణమ్ = ఈ నశ్వర శరీరమును, అవష్టభ్య = నిలిపి, ధారయామః=ధరించుచున్నాము అని, అభివదంతి=చెప్పుచున్నవా యన్నట్లున్నవి.

పిప్పలాదుడు తనను వైదర్భి యడిగిన రెండవ ప్రశ్నకు సమాధానమిట్లు చెప్పుచున్నాడు. పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము నను పంచభూతము లీ శరీరాది (వా వికల్పేన అనో జీవనం అస్య ఇది వాణమ్ శరీరమ్ - అనిశ్చిత జీవనము కలిగినది కావున శరీరము వాణమనబడును.) సృష్టికి కారణ పదార్థములు. నేత్రాది జ్ఞానేంద్రియములు (త్వక్కు. చక్షువులు, శ్రోత్రములు. జిహ్వా, ఘ్రాణము), వాగాది కర్మేంద్రియములు (వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థ), మనస్సు ననుఇంద్రియములన్నియు నీ శరీరవ్యాపారములను దెలుపుచున్నవి. ఇవి యన్నియు జడ

పదార్థములే. అయినను చేతనములవలె నివి తామే తమ మహిమతో నీ శరీర స్థితికి హేతువులైనట్లు చెప్పుచున్నట్లు మహర్షి వర్ణించుచున్నాడు. వాస్తవమున నింద్రియములు శరీరాంగములే కాని యవి శరీర ధారకములు కావు. అట్టియెడ నవి తమ్ము శరీర ధారకములుగా జెప్పుకొనినందున వాని గర్వము సూచింప బడినదని యెఱుగవలయును.

"తాన్ వరిష్ఠః ప్రాణ ఉవాచ, మా మోహ
మాపద్య థాహ మే వై తత్ పంచధాత్మానం
విభ జ్యైతద్ వాణ మవష్టభ్య విధారయా మీతి." 3

తాన్ = ఆ యింద్రియ రూపదేవతల నుద్దేశించి, వరిష్ఠః = సర్వోత్తమమైన, ప్రాణః=ప్రాణరూపదేవత, ఉవాచ=పలికెను, మోహం = భ్రమను, మా ఆపద్యథ=పొందవలదు, అహమ్ ఏవ = నేనే, ఆత్మానం= నన్ను, పంచధావిభజ్య = ఐదు విధములుగ విభజించి, ఏతత్ వాణమ్ = ఈ (అనిశ్చిత జీవనముగల) శరీరమును, అవష్టభ్య=నిలిపి, విధారయామి ఇతి=ధరించుచున్నాను - శరీరస్థితిని కాపాడుచున్నాను అని పలికెను.

నేత్రాదీంద్రియములు తామే శరీరస్థితికి హేతుభూతములని గర్వించి చెప్పుకొనగా. నయ్యది సహింపక ప్రాణ మా యింద్రియముల నుద్దేశించి 'ఓ యింద్రియములారా! మీరు భ్రమపడుచున్నారు. మీ రెట్లు శరీరస్థితికి కారణము కాగలరు? (కన్నులులేని) గ్రుడ్డివారు, బధిరులు, కుంటివారు, మూగవారు ఎందఱు లోకమున జీవించుటలేదు ? వారి కా యా యింద్రియములు చెడిన మాత్రమున వారి జీవనయాత్ర సమాప్తమైనదా ? గాఢ నిద్రాదశలో శరీరమున్నపుడు జ్ఞాన కర్మేంద్రియములే కాదు మనస్సుకూడ తన పనినుండి విరమించుకొనును కదా! అప్పుడు శరీరస్థితికి కారణము నన్ను మించి మఱియొక రెవ రున్నారు! నేనేకదా! ప్రాణాపానోదాన సమానవ్యానముల రూపమున నన్ను నేను విభజించుకొని యీ శరీరమును కాపాడుచున్నాను. నిద్రించునపుడు ప్రాణ వ్యాపారము దృగ్గోచర మగు చుండుట లోక విదితము. ఆప్రాణవ్యాపారము లేనినాడు మరణమేయగును.

శరీరస్థితికి భంగము కలుగును కావున నేనే యీశరీరస్థితి కాధారము, అని నుడివెను. పిప్పలాదుడు ప్రాణేంద్రియ సంవాద నెపమున విషయము వివరించు చున్నాడని పాఠకులు గుర్తింతురు గాక !

"తేఽశ్రద్దధానా బభూవుః, సోఽభిమానా దూర్ధ్వ ముత్ క్రామత ఇవ, తస్మిన్నుత్ క్రామ త్యథేతరే సర్వ ఏవోత్ క్రామంతే, తస్మింశ్చ ప్రతిష్ఠమానే సర్వ ఏవ ప్రాతిష్ఠంతే, తద్యథా మక్షికాః మధుకరరాజాన ముత్ క్రామంతం సర్వా ఏవోత్ క్రామంతే, తస్మింశ్చ ప్రతిష్ఠమానే సర్వా ఏవ ప్రాతిష్ఠంతే, ఏవం వాఙ్మన శ్చక్షుః శ్రోత్రం చ తే ప్రీతాః ప్రాణం స్తున్వన్తి." ४

తే=ఇంద్రియములు, అశ్రద్దధానాః బభూవుః=ప్రాణము పలికిన పలుకులయెడ శ్రద్ధవహింపని వాయెను, సః=ఆ ప్రాణము, అభిమానాత్ =ఆత్మాభిమానము వలన, రోషముతో, ఊర్ధ్వం ఉత్ క్రామతః ఇవ = పైకి లేచిపోయి నట్లాయెను, తస్మిన్ ఉత్ క్రామతి = ఆ ప్రాణముశరీరము నుండి వెలికిపోగా, ఇతరే సర్వే ఏవ ఉత్ క్రామంతే=ఇతరములైన ఇంద్రియాదులన్నియు వెడలిపోయెను. తస్మిన్ చ ప్రతిష్ఠమానే = ఆ ప్రాణము ప్రతిష్ఠితముకాగా, సర్వే ఏవ ప్రాతిష్ఠంతే = అన్నియు శరీరమునందు స్థితి కలిగినవయ్యెను, తత్ యథా = అదియెట్లన : ఉత్ క్రామంతం మధుకర రాజానం= తేనెతుట్టెను వదలివెళ్ళురాజగు (రాణి) తేనెటీగను, సర్వా ఏవ మక్షికాః = తేనెటీగలు మిగిలినవన్నియు, ఉత్ క్రామంతే = అనుసరించి వెడలిపోవును, తస్మిన్ చ ప్రతిష్ఠమానే = నాయకమక్షిక తేనెతుట్టెయందున్నచో సర్వా ఏవ ప్రాతిష్ఠంతే=అన్నియు నిలబడును, ఏవమ్=ఇట్లే, వాక్ మనః చక్షుః శ్రోత్రం చ = వాక్కు, మనస్సు, నేత్రశ్రోత్రములును, ప్రీతాః = ప్రసన్నములై, తే=ఆ యింద్రియములు, ప్రాణం=ప్రాణమును శ్రేష్ఠముగా గుర్తించి, స్తున్వంతి=స్తుతి చేయుచున్నవి.

ప్రాణము పలికిన పలుకులు విని యింద్రియము లా పలుకులయెడ శ్రద్ధ వహింపవయ్యె. ప్రాణశ్రేష్ఠత నంగీకరింప సిద్ధపడ వయ్యెను. అంతట ప్రాణము, కోపించి యభిమానముతో శరీరమునుండి బయటికి వెడలి నట్లాయెను. వెంటనే యింద్రియము లన్నియు శరీరమున వాని స్థితిని కోలుపోయి నట్లాయెను. ప్రాణము శరీరమును విడిచి వెళ్ళునపుడు ఇంద్రియాదులు ప్రాణము ననుగమించును. అవి శరీరమునందు నిలువజాలవు. తేనెటీగలలో నొక యీగ మిగిలిన వానికి రాణిగా వర్తించును ఆరాణి యీగ తేనెతుట్టెను విడిచి వెళ్ళిన మిగిలిన యీగలన్నియు దాని ననుసరించి వెళ్ళును. అట్లే యింద్రియములు కూడ ప్రాణగతి ననుసరించి వర్తించును. శరీరమున ప్రాణమున్నంత కాలమే యింద్రియము లందుండి స్వస్వ వ్యాపారముల నొనరించును. లేకున్న నట్లు చేయజాలవు. కావున ఇంద్రియములు ప్రాణగరిమను-మహిమను గుర్తించి యా ప్రాణమునే శరీరస్థితికి కారణముగ నంగీకరించి స్తుతి చేసినపని యభిప్రాయము.

"ఏషోఽగ్ని స్తప త్యేష సూర్య ఏష పర్జన్యో
మఘవా నేష వాయుః, ఏష పృథివీ రయిర్
దేవః సదసచ్చామృతం చ యత్." ౫

ఏషః=భోక్తృశక్తి ప్రధానమగు నీప్రాణమే, అగ్నిః=అగ్నిరూపమున, తపతి = తపించును-కాలును, ఏషః సూర్యః = ఇదియే సూర్యరూపమున ప్రకాశించును, ఏషః పర్జన్యః = ఇది మేఘమై వర్షించును, ఏషః మఘవాన్ = ఇదియే ధనవంతము, ఏషః వాయుః = ఇదియే వాయువు, పృథివీ = భూమివలె నన్నింటి కీ ప్రాణమే యాశ్రయము, రయిః దేవః= భోగ్యదేవత, సత్ అసత్ చ=స్థూలసూక్ష్మ పదార్థము నిదియే, యత్ చ అమృతం=నాశరహితమగు కారణపదార్థ మిదియే.

ఇంద్రియములు ప్రాణ మహత్వమును గుర్తించి - స్తుతియించిన విధము నిట ప్రదర్శించుచున్నాడు. ప్రథమ ప్రశ్నకు సమాధానముగ భోక్తృ

భోగ్య పదార్థముల యుత్పత్తి చెప్పబడినది. అందు భోక్తృశక్తి ముఖ్యమైనది. ఆ భోక్తృశక్తియే యిట ప్రాణము. దాని ప్రాధాన్యమే యిట ప్రదర్శింపబడినది. ప్రాణమే అగ్ని, ఆదిత్య, పర్జన్యాదిరూపములతో నానా విధ కార్యకరణశక్తి కలిగియున్నట్లు వర్ణించియున్నాడు. భోక్త లేనివాడు భోగ్యము నిరర్థకమగును భోగ్యములేకున్న భోక్తయునికి నిరర్థకముకాదు కావున భోగ్యముకంటె భోక్తృశక్తి శ్రేష్ఠమనుట నిర్వివాదాంశము. ఇంకను ప్రాణరూప భోక్తృశక్తి ప్రాధాన్యము నిట్లు వర్ణించుచున్నాడు.

"అరా ఇవ రథనాభౌ ప్రాణే సర్వం ప్రతిష్ఠితమ్.
ఋచో యజూగ్ంషి సామాని యజ్ఞః క్షత్రం బ్రహ్మ చ."౬

రథనాభౌ అరాః ఇవ=చక్రపుకుండలో ఆకు లిమిడి యుండునట్లు, ప్రాణే=ప్రాణమునందు, సర్వం ప్రతిష్ఠితమ్=అంతయు నున్నది, ఋచః=ఋక్కులు, యజూంషి=యజుస్సులు, సామాని=సామములు, యజ్ఞః=యజ్ఞము, క్షత్రం=క్షత్రము, బ్రహ్మ చ=బ్రహ్మమును.

ఋగ్యజుస్సామ నామములతో ప్రసిద్ధములయిన మంత్రసంహితలు, వానియందు కర్తవ్యములుగా విధింపబడిన యజ్ఞాది కర్మలు, లోకరక్షణ యోగ్యమగు క్షాత్రము, జ్ఞానము మున్నగునవన్నియు, చక్రనాభియందు ఆకు లిమిడియుండునట్లు ప్రాణమునం దిమిడియుండును. ప్రాణములేనినాడు బ్రాహ్మణ క్షత్రియాది వర్ణవ్యవస్థిత మానవులు కాని, వారిచే నధ్యయనము చేయబడు వేదాది శాస్త్రములు కాని, యజ్ఞాది కర్తవ్య కర్మలు కాని యేవియు నుండవు. లోకస్థితియే సంభవము కాజాలదు. కావున జగత్ ప్రతిష్ఠకు కారణ భూతమగునది ప్రాణమని సిద్ధమగుచున్నది. భోక్తలేని భోగ్య మెట నుండును ?

"ప్రజాపతి శ్చరసి గర్భే త్వమేవ ప్రతిజాయసే,
తుభ్యం ప్రాణ ప్రజా స్త్విమా బలిం హరంతి
యః ప్రాణైః ప్రతి తిష్ఠతి."

ప్రాణః = ఓప్రాణమా!, త్వమ్ ఏవ=నీవే, ప్రజాపతిః=ఉత్పన్నమగు నీ సృష్టిని పాలించువాడవై, గర్భే=గర్భమునందు, చరసి=వర్తించుచున్నావు. ప్రతిజాయసే=నీవే పుట్టుచున్నావు యః=ఏ నీవు, ప్రాణైః=ప్రాణాపానాది భిన్ననామములతో, ప్రతితిష్ఠసి = ఈ శరీరమునందుండి యున్నావో, యట్టి, తుభ్యంతు=నీ కొఱకే, ఇమాః ప్రజాః=ఈప్రజలు, బలిం=అన్నమును, హరంతి=గ్రహించుచున్నారు - తినుచున్నారు.

శరీరమునందు జరుగు సమస్త క్రియలకు నాధారము ప్రాణమే. ప్రాణులు భుజించెడి పదార్థములు శరీరమునందు చేరుటకు, భిన్న భిన్న కోశములందు చేరి భిన్నరూపములను బొందుటకు, శరీరమున నెల్లయెడల వ్యాపించుటకు, వమనాదుల మూలమున లోపలి వస్తువులు వెలుపలికివచ్చుటకు నన్నింటికి ప్రాణమే ముఖ్యహేతు వనదగును. గర్భస్థశిశువులు బయట బడుటకు కూడ ప్రాణము కారణము. ఈప్రాణమే-ప్రాణము, అపానము, ఉదానము, సమానము, వ్యానము ననునామములతో శరీరమున హృదయాది స్థానములందుండి నానావిధ క్రియలకు హేతువగుచున్నది. ఈ ప్రాణరక్షణార్థమే ప్రాణులు అన్నాదులను కానుకలుగా సమర్పించుచున్నవి. ఇంద్రియములు ప్రాణప్రాశస్త్యము నిట్లు వర్ణించుచున్నవని భావము.

"దేవానా మసి వహ్నితమః పితౄణాం ప్రథమా స్వధా
ఋషీణాం చరితం సత్య మథర్వాంగిరసా మసి." ౮

(ఓప్రాణమా! నీవు) దేవానాం = దివ్యగుణములు గల వస్వాది దేవతలలో, వహ్నితమః = మిక్కిలిగ వహన కార్యనిర్వాహకుడవు, పితౄణాం = పితరులకు, ప్రథమాస్వధా = ప్రథమమున సంతోషమును కలిగించువాడవు అంగిరసాం అథర్వా = తపస్వులకు నిశ్చయాత్మక తపస్వివి. ఋషీణాం = ఋషులకు, సత్యం చరితం అసి = సత్యాచరణమునై యున్నావు.

శరీరమునందు వసు నామముచే బేర్కొనబడు పృథివ్యాది పదార్థము లున్నవి. వానిలో ప్రాణము సమస్త క్రియలను నిర్వహించుటకు ముఖ్య సాధన మగుచున్నది. ప్రాణ సహిత సంతాన మేర్పడి నపుడు పితరులు-తల్లిదండ్రులు మిక్కిలి సంతసింతురు ప్రాణ సంయమనము మూలమున ఋషులు - విద్వాంసులు నియత జీవితము కలవారై క్రమముగా సత్యమును బొంది కృతకృత్యు లగుదురు. ఇట్లు ప్రాణ మెల్లరకు ముఖ్యమని భావము.

"ఇంద్ర స్త్వం ప్రాణ! తేజసా రుద్రోఽసి పరిరక్షితా,
త్వ మంతరిక్షే చరసి; సూర్య స్త్వం జ్యోతిషాం పతిః." ౯

ప్రాణః = ఓప్రాణమా! త్వం=నీవు, ఇంద్రః = ఇంద్రుడవు, తేజసా=తీక్ష్ణతచే, రుద్రః అపి=రుద్రుడవగుచున్నావు, పరిరక్షితా=రక్షకుడవు, త్వమ్=నీవు, అంతరిక్షే=ఆకాశమున, చరసి=చరింతువు, త్వమ్ = నీవు, జ్యోతిషాం=జ్యోతిస్సులకు, పతిః = రక్షకుడవైన, సూర్యః = సూర్యుడవు.

ప్రాణము వాయురూపముతో సృష్టికారక మగుచు నన్నము నుత్పన్నము చేయును. కావున ఇంద్రుడనియు, శరీరమునుండి ప్రాణము పోయి నపుడు బంధువుల నెడిపించుటచే రుద్రుడనియు, శరీరమున నున్నంత కాలము జీవితమున కెట్టి హానియు కలుగదు, కావున పరిరక్షిత - రక్షకుడనియు నిట వర్ణింపబడినది. ఆ ప్రాణము ప్రాణుల హృదయాకాశమున మందును కావున నంతరిక్షచారి యగును. భోక్తృశక్తి రూపమున దివమున వెలుంగు జ్యోతిస్సులకు ప్రకాశము నొసంగుచు సూర్యనామమున స్తుతియింపబడినట్లు- తెలిసికొనవలయును.

"యదా త్వ మభివర్ష స్యథేమాః ప్రాణ! తే ప్రజాః
ఆనందరూపా స్తిష్ఠంతి కామాయాన్నం భవిష్య తీతి." ౧౦

ప్రాణః=ప్రాణమా!, యదా=ఎప్పుడు, త్వమ్=నీవు, అభివర్షసి =వర్షింతువో, అథ = అప్పుడు, ఇమాః తే ప్రజాః = ఈ నీ ప్రజలు,

కామాయ=కోరిక నెఱవేఱుటకు తగినంత. అన్నం భవిష్యతి ఇతి=అన్నము లభింపగలదని, ఆనందరూపాః తిష్ఠంతి=ఆనందరూపులై యుందురు.

ఓ ప్రాణమా! నీవు వాయురూపమున మేఘములలో సంఘర్షణ కల్పించి వానిని భూమిపై వర్షించునట్లు చేయుదువు అప్పుడు నీ కారణమున సృష్టింపబడిన భూమిపైనుండు ప్రజలు తమ యభీష్టములకుతగినంత యన్నము వర్షమువలన నుత్పన్నము కాగలదని యెంచి యెంతయో యానందింతురు. ఇందు ప్రాణము ప్రజల యానందమునకు హేతువుగా స్తుతియింప బడినదని గుర్తింపవలయును

"వ్రాత్య స్త్వం ప్రాణైక ఋషిరత్తా విశ్వస్య సత్పతిః,
వయ మాద్యస్య దాతారః, పితా త్వం మాతరిశ్వనః." ౧౧

ప్రాణ!-ప్రాణమా!, త్వం వ్రాత్యః - నీవు అసంస్కార్యుడవు, నిత్యశుద్ధుడవు ఏకః-ఒక్కడవు, ఋషిః - గమనశీలుడవు, అత్తా-తినువాడవు - భోక్తవు, విశ్వస్య సత్పతిః - సర్వము నుత్తమముగా పాలించువాడవు, వయమ్ - మేము (ఇంద్రియాదులు), ఆద్యస్యదాతారః - భక్ష్యపదార్థములను చేకూర్చువారము, త్వమ్ - నీవు, మాతరి శ్వనః - వాయువునకు, పితా-జనకుడవు.

ప్రాణము శుద్ధమైనది. దానిని శుద్ధి చేయుటకు-సంస్కారమొనర్ప నవసరముండదు. శరీరమునం దంతట ప్రాణ మొక్కటియే యుండును. లేక యందఱిలోను నుండు ప్రాణరూప మొక్కటిగా నుండును వాయు యోగమున నెల్లప్పుడు గతి శీలమై యుండును. అదియే భోక్త-పదార్థముల ననుభవించును. కావలసిన అన్నాది పదార్థములను ఇంద్రియములు చేకూర్చుచుండును. ఆకాశగత స్థూలవాయువున కదియే జనకము.

"యా తే తనూర్ వాచి ప్రతిష్ఠితా, యా శ్రోత్రే
యా చ చక్షుషి, యా చ మనసి సంతతా,
శివాం తాం కురు మోత్ క్రమీః." ౧౨

ఓ ప్రాణమా!, తే యా తనూః - నీ యే తనువు. వాచి ప్రతిష్ఠితా- వాణియందున్నదో, యా శ్రోత్రే-ఏది చెవులలో నున్నదో, యా చ చక్షుషి =ఏది నేత్రముల నున్నదో, యా చ మనసి ఏది మనస్సున, సంతతా = వ్యాప్తమై యున్నదో, తామ్. ఆ తనువును, శివాం కురు - శుభంకరము చేయుము. మా ఉత్క్రమీః-ఉత్ క్రమణము చేయవలదు - శరీరమును విడిచి వెళ్ళకు.

ప్రాణము అపానరూపమున వాక్కునందును, వ్యాన రూపమున శ్రవణమునందును, ప్రాణరూపమున నేత్రమునందును, సమానరూపమున మనస్సునందును నుండునని విజ్ఞుల యభిప్రాయము. ఆ యా రూపములే ప్రాణ తనువుగా నిట వర్ణింపబడినవి. ఆ యా యింద్రియములందు గల ప్రాణవృత్తి సరిగాలేనపు డాయింద్రియములు స్వస్వకార్యములందసమర్థము లగును. కావున ఇంద్రియములన్నియు 'ప్రాణమా! నీవు మాయందున్న నీ ప్రాణాది తనువును శుభంకరముగా నుంచుము. నీ వుత్క్రమింపకుము. నీ యుత్క్రమణమున మా స్థితికే భంగము వాటిల్లును. కావున మాయెడ కరుణింపుము' అని స్తుతియించినట్లు భావింపవలయును.

"ప్రాణ స్యేదం వశే సర్వం త్రిదివే యత్ ప్రతిష్ఠితమ్,
మాతేవ పుత్రాన్ రక్షస్వ, శ్రీశ్చ ప్రజ్ఞాంచవిధేహినఇతి." ౧౩

త్రిదివే - ముల్లోకములందును, యత్ ప్రతిష్ఠితమ్ - ఏది కలదో ఇదం సర్వం - ఇది యంతయు, ప్రాణస్య వశే - ప్రాణమున కధీనమై యున్నది, మాతా పుత్రాన్ ఇవ - తల్లి పుత్రులనువలె, రక్షస్వ - రక్షింపుము, నః - మాకు, శ్రీః చ ప్రజ్ఞాం చ - కాంతి, విజ్ఞానము, విధేహి - కల్పింపుము, ఇతి-ప్రశ్న సమాప్తి సూచకము.

చరాచరాత్మకమగు నీప్రపంచ వ్యవహారమంతయు ప్రాణముమీదనే యాధారపడియున్నది. లోక జీవనమున కంతటికి ప్రాణమే హేతువుకదా!

ప్రాణరహిత ప్రపంచము చేష్టారహిత మగును. కావున 'నో ప్రాణమా! నీవు స్థిరమై లోకమున క్షాత్రశోభను, వేదాది శాస్త్రవిజ్ఞానమును విస్తరింప జేయుము' అని చక్షురాదీంద్రియములు ప్రాణపరిష్ఠతను స్తుతియించి తమ యవనత నంగీకరించినవి. ప్రాణేంద్రియ సంవాద నెపమున సృష్టిస్థితికి ప్రాణప్రాముఖ్యమును పిప్పలాదుడు వర్ణించి వైదర్భి ప్రశ్నకుసమాధానము చెప్పియున్నాడు.

మూలమునందలి 'ఇతి' పదము ప్రశ్న సమాప్తిని తెలుపుటకు ప్రయోగింపబడినది.

ద్వితీయ ప్రశ్నము సమాప్తము

తృతీయ ప్రశ్నము

"అథ హైనం కౌసల్య శ్చాశ్వలాయనః పప్రచ్ఛ, భగవన్!
కుత ఏష ప్రాణో జాయతే? కథ మాయా
త్యస్మిఞ్ ఛరీర? ఆత్మానం వా ప్రవిభజ్య
కథం ప్రాతిష్ఠతే? కేనోత్క్రమతే? కథం బాహ్య
మభిధత్తే! కథ మధ్యాత్మ మితి?" ౧

అథ=పిదప, ఆశ్వలాయనః కౌసల్యః=అశ్వ గోత్రోత్పన్నుడగు కౌసల్యుడు, ఏనం హ=పిప్పలాదుని, పప్రచ్ఛ=ఇట్లడిగెను, భగవన్ః= స్వామీః, ఏషః ప్రాణః=ఈ ప్రాణము, కుతః=దేనినుండి, జాయతే = పుట్టును?, అస్మిన్ శరీరే=ఈ శరీరములోనికి, కథం ఆయాతి = ఎట్లు వచ్చును, ఆత్మానం = తనను, ప్రవిభజ్య = విభజించి, కథమ్ = ఎట్లు, ప్రాతిష్ఠతే=శరీరమున స్థితమైయుండును, కేన=ఏవిధమున, ఉత్క్రమతే =ఉత్క్రమించును _ శరీరమునుండి నిష్క్రమించును?, కథమ్ = ఎట్లు. బాహ్యమ్=వెలుపలి విషయజ్ఞానమును, కథం ఆధ్యాత్మమ్ చ=ఎట్లు ఆధ్యాత్మిక సుఖదుఃఖజ్ఞానమును, అభిధత్తే=ధరించును?, ఇతి=అని ప్రశ్నించెను.

వైదర్భి యడిగిన ద్వితీయ ప్రశ్నకు సమాధానముగ పిప్పలాదుడు ప్రాణమహత్వము నెంతగానో వర్ణించెను. అంతట అశ్వలగోత్రజుడగు కౌసల్యుడు 'ప్రాణ మెటనుండి జనించును? ఈశరీరమునం దెట్లు చేరును? ప్రాణము త న్ననేకవిధముల విభజించికొని శరీరమున నెట్లుండును? అది యె ట్లీశరీరమునుండి యుత్క్రమించును? ఎట్లు బాహ్య విషయక జ్ఞానమును, ఎట్లు ఆధ్యాత్మిక సుఖదుఃఖ జ్ఞానమును సంపాదించును? స్వామీః' అని పిప్పలాదుని ప్రశ్నించెను.

"తస్మై స హోవాచాతి ప్రశ్నాన్ పృచ్ఛసి
బ్రహ్మిష్ఠోఽసీతి తస్మా త్తేఽహం బ్రవీమి." ౨

తస్మై=ఆ కౌసల్యునకు, సః=ఆ పిప్పలాదుడు, ఉవాచ=ఇట్లు చెప్పెను, అతిప్రశ్నాన్ పృచ్ఛసి = మిక్కిలి ప్రశ్నల నడుగుచున్నావు, బ్రహ్మిష్ఠః అసి=మిక్కిలి బ్రహ్మజ్ఞుడవుగా నున్నావు, తస్మాత్=అందువలన, తే=నీకు, అహం బ్రవీమి ఇతి=నేనుపదేశింతును, అని యనియె.

పిప్పలాద మహర్షి కౌసల్యు డడిగిన ప్రశ్నలను విని, వాని మూలమున నతని యోగ్యతను గుర్తించి, యతనిని జ్ఞానవంతుడని ప్రశంసించి, ప్రాణ విషయమును వివరముగా జెప్పెదనని యందులకు గడంగెను.

"ఆత్మన ఏష ప్రాణో జాయతే, యథైషా పురుషే ఛాయైతస్మి
న్నేత దాతతం, మనోకృతే నాయా త్యస్మిఞ్ ఛరీరే." 3

ఏషః ప్రాణః=ఈ ప్రాణము, ఆత్మనః = పరమేశ్వరుని వలన, జాయతే=జనించును, పురుషే=శరీరము ఉండగా, ఛాయా=నీడ, యథా= ఎట్లు కలుగునో, యట్లే, ఆత్మయున్న ప్రాణ ముండును, ఏతస్మిన్ = ఈప్రాణమునందు, ఏతత్=ఇయ్యది, ఆతతమ్=వ్యాప్తమై యున్నది, అస్మిన్ శరీరే = ఈ శరీరములోనికి, మనోకృతేన అయాతి = మానసిక వాసనారజ్జువులచే నాకర్షింపబడి వచ్చును.

సమస్త విశ్వోత్పత్తికి హేతువు పరమేశ్వరుడే. అతనివలననే ప్రాణము కూడ ఉత్పన్నమగును. పరమేశ్వరుడు లేనినాడు సృష్టియే యుండదు అత డన్నింటియందును వ్యాపించి యుండును. అతడు వ్యాపకుడు ప్రాణమునందును నత డుండును. పరమేశ్వరు నేదియు వ్యాపింపజాలదు. వ్యాప్యమై - పరిచ్ఛిన్నమై సర్వము నతనియందే యుండు నని భావము. శరీరమును ఛాయ యంటియుండునట్లు జగత్తు పరమేశ్వరుని స్థితిపై నాధారపడి యుండును జీవుడు చేసికొను శుభాశుభకర్మల ఫలము ననుభవింప జేయుటకై జీవులకు పరమేశ్వరుడు శరీరాదులను నిర్మించును. ఆ శరీరము ప్రాణసహితమైన నాడే ఫలము ననుభవింప నను వగును.

కావున శరీరముతో ప్రాణము సంబద్ధమగును జీవులకుసుఖదుఃఖానుభవము కలిగించుటకై ప్రాణము శరీరమున జేరునని భావము.

"యథా సమ్రాడేవాధికృతాన్ వినియుఙ్క్తే- ఏతాన్ గ్రామా
నేతాన్ గ్రామా నధితిష్ఠ స్వేత్యేవ మేవైష ప్రాణ ఇతరాన్
ప్రాణాన్ పృథక్ పృథగేవ సంనిధత్తే." ౪

సమ్రాట్ ఏవ=చక్రవర్తియే, యథా=ఎట్లు, అధికృతాన్=అధికారులను, ఏతాన్ గ్రామాన్, ఏతాన్ గ్రామాన్=ఈ ఈగ్రామములకు, అధితిష్ఠస్వ ఇతి వినియుఙ్క్తే=అధిపతివికమ్ము అని నియోగించునో, ఏవమ్ఏవ=ఇట్లే, ఏషః ప్రాణః=ఈ ప్రాణము, ఇతరాన్ ప్రాణాన్=ఇతర ప్రాణములను, పృథక్ పృథక్ ఏవ=వేఱువేఱుగనే, సంనిధత్తే=నియోగించును.

రాజు అధికారులను భిన్నభిన్న స్థానములందు భిన్నభిన్నకార్యముల నొనర్చుటకు నియోగించునట్లు, శరీరమున నన్నింటికంటె ముఖ్యమగు ప్రాణమే నేత్రాదీంద్రియ స్థానములందు జరుగవలసిన వ్యాపార నిర్వహణార్థ మితర-అపానాది ప్రాణములను వినియోగించును. ప్రాణమెట్లు తనను విభజించుకొని శరీరమునందు వర్తించును? అను ప్రశ్న కియ్యది సమాధానముగ పిప్పలాదుడు చెప్పి యున్నాడని గుర్తింపనగును.

"పాయూపస్థేఽపానం, చక్షుఃశ్రోత్రేముఖనాసికాభ్యాంప్రాణః
స్వయం ప్రాతిష్ఠతే మధ్యే తు సమానః, ఏష హ్యేత ద్ధుత
మన్నం సమం నయతి తస్మా దేతాః సప్తార్చిషో భవంతి." ౫

పాయూపస్థే=గుదజననేంద్రియములందు, అపానమ్=అపానము, ముఖనాసికాభ్యాం=ముఖనాసికముల ద్వారమున వెలువడుచు, చక్షుఃశ్రోత్రే=నేత్రశ్రోత్రములందు, ప్రాణః=ప్రాణము, స్వయం=స్వయముగ, ప్రాతిష్ఠతే=ఉండును, మధ్యే=పాయూపస్థలకు చక్షుశ్శ్రోత్రములకు మధ్య-నాభిస్థలమున, సమానః = సమానము, ఏషః హి = ఈ సమానమే, ఏతత్

హుతం అన్నం=ఈభుజింపబడిన అన్నమును, సమంనయతి=సమముగా చేర్చును, తస్మాత్=ఆ యన్నమువలన, ఏతా సప్త అర్చిషః=ఈ యేడు దీప్తులు, భవంతి=ఏర్పడును.

ప్రాణము శరీరమునందే యే భాగముల నెట్లు పనిచేయు నదియు నిట వర్ణింపబడినది. ప్రాణము, అపానము, ఉదానము, సమానము, వ్యానము నను నామములతో విభజింపబడి శరీరమున నా యా స్థలములం దుండి భిన్న కార్యముల నొనరించుచుండును ఆ యైదువిధములగు ప్రాణములలో ప్రాణము, అపానము, సమానము ననువానిగూర్చి యిట చెప్పబడు చున్నది. పాయూపస్థలు కర్మేంద్రియములు. వాయువు మలవిసర్జ నేంద్రియము. ఉపస్థ మూత్రేంద్రియము. వీనియందు అపాననామక ప్రాణముండి మలమూత్ర విసర్జన కార్యములకు తోడ్పడుచుండును. నేత్రములందును చెవులలోను ప్రాణము స్వయముగా నుండును ముఖము నుండియు, నాసికనుండియు బయటికి వెలువడుచు నుండును. సమాన నామక ప్రాణము నాభిస్థానమున నుండి ప్రాణులు తినిన పదార్థములు - అన్నాదులు రసాదులుగా మారిన తదుపరి యితరావయవములందంతటను వానికవసరమైనంత చేర్చుచుండును. ఇట్లీ ప్రాణము భిన్నభిన్న కార్యములు నిర్వర్తించుట వలన కన్నులు, చెవులు, ముక్కులు, ముఖము - నోరు నను నేడవయవములు వానివాని కార్యములు చక్కగా నిర్వర్తించుచుండును. చూచుట, వినుట, ఉచ్ఛ్వాస నిఃశ్వాసకార్యములు, తినుట మ్రింగుట మున్నగు కార్యములు ప్రాణసహాయముననే జరుగునని భావము.

"హృది హ్యేష ఆత్మా అత్రైత దేకశతం నాడీనాం తాసాం శతం శత మేకైకస్యాం ద్వాసప్తతిర్ ద్వాసప్తతిః ప్రతిశాఖా నాడీ సహస్రాణి భవం త్యాసు వ్యాన శ్చరతి." ౬

ఏషః హి ఆత్మా=ఈ జీవాత్మ, హృది=హృదయమున నుండును. అత్ర=అచట - ఆ హృదయమున, నాడీనాం=నాడులు, ఏతత్ ఏకశతం=

మూటఒక్కటి ఉండును, తాసామ్ = ఆ నాడులలో నొక్కొక్కదానికి, శతం శతం=నూఱునూఱు ఉపనాడులున్నవి, ఏకైకస్యాం=ఆ శాఖానాడులలో నొకొక్కక్కదానియందు, ద్వాసప్తతిః, ద్వాసప్తతిః=డెబ్బదిరెండు డెబ్బదిరెండు, ప్రతిశాఖా నాడీ సహస్రాణి=వేల చిన్నచిన్న నాడులున్నవి, ఆసు=ఈ నాడు లన్నింటిలోను, వ్యానః చరతి = వ్యాననామము గల ప్రాణము చరించును.

ఇందు వ్యాననామక ప్రాణస్థితి వర్ణింపబడినది. ఈశరీరమునకధినేతయగు జీవాత్మ హృదయాకాశమున నుండును. ఆ హృదయ మొక మాంసపిండము. ముకుళిత కమలాకారమున నుండును. దానినుండి నూటొక్కనాడులు బయలు వెడలును అవి మూలనాడులు, ఆ నూటొక్క మూలనాడులలో ప్రతి నాడినుండియు నూఱు నూఱు ఉపనాడులు బయలుదేరును. ఆ యుపనాడులలోను ప్రతినాడికి డెబ్బదిరెండు వేల చొప్పున సూక్ష్మనాడులేర్పడి శరీరమంతటను వ్యాపించును. ౧౦౧ × ౧౦౦=౧౦౧౦౦ ౧౦౧౦౦ × ౭౨=౭౨౭౨౦౦౦౦౦ అన్నియుకలిసి (నాడులు,ఉపనాడులు ఉపశాఖానాడులు) ౭౨౭౨౧౦౨౦౧ డెబ్బది రెండుకోట్లు, డెబ్బది రెండు లక్షల, పదివేల రెండువందల ఒక్కనాడు లగుచున్నవి. ఈ నాడులలో నన్నింటి యందును నుండు ప్రాణమునకు వ్యానమని నామము. అయ్యది సమస్త శరీరమునకు పోషకరసమును చేకూర్చుచుండును.

"అథైక యోర్ధ్వ ఉదానః పుణ్యేన పుణ్యం లోకం నయతి,
పాపేన పాప, ముభాభ్యా మేవ మనుష్యలోకమ్." ౭

అథ=ఇక, ఉదానః = ఉదాననామక ప్రాణము, ఏకయా=నూటఒక్కనాడులలో నొకటి యగు నొకనాడి మూలమున, ఊర్ధ్వః=నాభికిపైన వర్తించునదై, పుణ్యేన = వేదవిహిత శుభ కర్మలాచరించుటచే, పుణ్యం లోకం=పుణ్యలోకమును, పాపేన=నిషిద్ధమైన యసత్యాచరణాది పాప కర్మాచరణచే, పాపం=పాపలోకమును, ఉభాభ్యాం = శుభాశుభ కర్మల

నాచరించుటచే, మనుష్యలోకమ్ ఏవ = మానవ శరీరమును, నయతి = పొందించును - చేర్చును.

పూర్వమున ప్రాణాపాన సమాన వ్యానములను గూర్చి చెప్పి, యిట ఉదానమును వివరించుచున్నాడు ఉదానమే కంఠమున నుండును. అయ్యది హృదయమునుండి వెడలు నూటఒక్క నాడులలో నొకటియగు సుషుమ్న నాడి ద్వారమున నాభికి పై భాగమునందు చరించుచుండును. జీవుడు ఈ శరీరమున నుండి వేదాది శాస్త్రవిహితము అయిన యజ్ఞాది శుభ కర్మము లను, నిషిద్ధము అయిన యసత్యాచరణాది అశుభ కర్మములను ఆచరించు చుండును. శుభకర్మల నాచరించు జీవు డీ శరీరమును విడిచిన పిమ్మట ఉదాన మతనిని సుఖముల ననుభవించుట కనువగు శరీరమున (లోకము) జేర్చును. పాపకర్మల నాచరించు జీవుని దుఃఖభూయిష్ఠములగు తిర్యగ్యోను లందు (పాపలోకములందు) చేర్చును. శుభాశుభ కర్మల నాచరించువానిని మనుష్యయోనిం జేర్చును.

ఈ విషయము 'కఠవల్లి' యందు నిట్లు వర్ణింపబడినది.

"....శతం చైకా చ హృదయస్య నాడ్యః, తాసాం మూర్ధాన మభినిస్సృతైకా, ఏతస్యామేవ సుషుమ్నా నాడ్యా ముదానో విచరతి, ఇయం నాడీ మూర్ధాన మారభ్యా పాదతల మస్మిన్ ఛరీర ఆయతా; అస్యామేవ హృదిస్థాయాం జీవాత్మా తిష్ఠతి, అనయైవ మనో యుంజానాః సమాహితా యోగిన ఆత్మజ్ఞానం లభంతే, ఉదాననామా ప్రాణ ఏవ లింగశరీరేణ సార్ధం జీవాత్మానం శరీరా న్నిస్సారయతి, కర్మానుకూలా యోనిభోగా చ ప్రాపయతి."

'హృదయమున నూటఒక్క నాడులున్నవి. వానిలో నొక్కటి మూర్ధము (బ్రహ్మరంధ్రము) వైపునకు వెడలియున్నది ఈ సుషుమ్నా నాడియందే ఉదాననామక ప్రాణము చరించును. ఈనాడి మూర్ధము మొదలు

పెట్టి, అపాదతల మీశరీరమునం దంతటను విస్తరించి యున్నది. హృదయమున నీ నాడియందే జీవాత్మ యుండును. ఈ నాడీద్వారమున యోగము నభ్యసించు యోగులు సమాహితు లగుదురు. వారి మనస్సు నిశ్చలమగును. ఆత్మజ్ఞానము వారికి లభించును. ఉదానమే లింగశరీరముతో బాటు జీవుని, శరీరమునుండి బయటికి నడపును. ఆ జీవు డాచరించు కర్మల కనుకూలమైన శరీరమున నతని జేర్చి, యట నతనికి సుఖదుఃఖము లనుభవింప దోడ్పడును.'

"ఆదిత్యో హ వై బాహ్యః ప్రాణః ఉదయ త్యేష హ్యేనం
చాక్షుషం ప్రాణ మనుగృహ్ణానః, పృథివ్యాం యా
దేవతా సైషా పురుష స్యాపాన మవష్టాభ్యాంతరా
య దాకాశః స సమానో వాయుర్ వ్యానః." 8

ఆదిత్యః హ=ప్రసిద్ధుడగు సూర్యుడు, వై=నిశ్చయముగ, బాహ్యః ప్రాణః=శరీరమునకు వెలుపలనుండు ప్రాణము, ఏషః హి = ఇతడే, ఏనం చాక్షుషం ప్రాణం = ఈ నేత్రసంబంధమైన ప్రాణమును, అనుగృహ్ణానః=అనుగ్రహించుచున్నవాడై, ఉదయతి = ఉదయించును, పృథివ్యాం యా దేవతా = భూమియందలి దేవత - భౌతికాగ్ని, సా ఏషా = భౌతికాగ్ని రూపదేవత, పురుషస్య అపానం = పురుష శరీరమునందలి యపానమును, అవష్టభ్య=ఆకర్షించి శరీర స్థైర్యమును కాపాడును, అంతరా =భూమిదివములకు మధ్య నుండు, యత్ ఆకాశః = ఆకాశము, సః సమానః=సమానము, వాయుః=వాయువు, వ్యానః = వ్యానము.

ఇంతకు పూర్వము శరీరమునందుండు పంచ ప్రాణములను, వాని స్థాన వ్యాపారములను వర్ణించి ప్రస్తుతము వానికి సహకారులుగ పనిచేయు బాహ్య పంచప్రాణముల నిట వర్ణించుచున్నాడు. ఆకాశమున ప్రకాశించు సూర్యుడే ప్రాణము. శరీరగత ప్రాణమునకు ప్రాణ మన నగును. నేత్రాదు

లందుండి వానికి తోడ్పడు ప్రాణమునకీ సూర్యుడు సహకారియగును. అందువలననే సూర్యుడు ప్రకాశించునపుడే నేత్రములు రూపగ్రహణము చేయగలవు సూర్యకాంతి లేనిచో నేత్రములదృష్టి యనుపయుక్తమగును. భూమిలో నుండు అగ్ని ప్రాణుల శరీరమునందలి అపానమును లాగియుంచి శరీరస్థితికి హేతువగును. కావున భౌతికాగ్ని అపాన మనదగును. ఇక నంతరాళమున నుండు ఆకాశము సమాన మనబడును. భూమినిచుట్టి యెల్ల యెడలనుండు వాయువు వ్యానము. నాడీగతవ్యాన సహకారి యగుచున్నది.

"తేజో హ వై ఉదాన స్తస్మా దుపశాంత తేజాః,
పునర్భవ మింద్రియైర్ మనసి సంపద్యమానైః" ౯

తేజః హ వై=తేజస్సు, ఉదానః=(శరీరగతమగు నుదానమునకు సహాయకము) ఉదానము, తస్మాత్ = దానివలన, ఉపశాంతతేజాః = శాంతించిన జీవనము కలవాడగును-మరణించును. మనసి సంపద్యమానైః =మనస్సున విలీనములైన, ఇంద్రియైః=ఇంద్రియములతో, పునర్భవం =పునర్జన్మ మేర్పడును.

సాధారణముగ నంతట నుండు తేజస్సే ఉదానము. జీవుని ఉత్క్రమణమునకు శరీరమునుండి వెలువడుటకు తోడ్పడును. కావున, ఉదాన మనబడును. జీవుడు శరీరమునుండి యుత్క్రమించుటవలన శరీరమునగల జీవన తేజస్సు ఉపశమించును ప్రాణి మరణించు నని భావము. జీవుడు శ రీ ర ము నుం డి యుత్క్రమించునపుడు నేత్రాదీంద్రియము లన్నియు మనమునం జేరి దానితోపాటు జీవుని అనుగమించి, యింకొక దేహమున జేరి యట జన్మించును. ఉదాన మిట్లు జీవుని యుత్క్రాంతికి, దేహాంతర ప్రాప్తికి తోడ్పడు నని భావము.

"యచ్చిత్త స్తేనైష ప్రాణ మాయాతి ప్రాణ స్తేజసా యుక్తః
సహాత్మనా యథా సంకల్పితం లోకం నయతి." ౧౦

యచ్చిత్తః=శరీరమునుండి నిష్క్రమించునపుడు జీవు డెట్టి చిత్తము గలవాడగునో, ఏషః=ఆ జీవుడు, ప్రాణం = ప్రాణమును, ఆయాతి = పొందును, ప్రాణః=ప్రాణము, తేజసా=ఉదానముతో, యుక్తః=కూడి, ఆత్మనా సహ = జీవునితోబాటు, యథా సంకల్పితం= కర్మవశమున నభిమతమగు, లోకం= లోకమును - శరీరమును, నయతి=చేర్చును

జీవుడు శరీరమునం దున్నంత కాలము శుభములో, అశుభములో, ఉభయాత్మకములో కర్మ లాచరించుచుండును ఎట్టి కర్మ లెక్కుడుగా నాచరించునో యట్టి చిత్తుడగును. ఆ యా కర్మజన్మ వాసనలతో నతని చిత్తము చిత్రింపబడును, జీవు డీ శరీరమును విడుచునపుడు నభ్యస్త ప్రవృత్తి కలిగియే యుండును. శరీర సంబంధము విడివడగానే యతడు ప్రాణముతోగూడి ఉదానసాహాయ్యముతో దేహాంతరమునజేరును ఆరాబోవు దేహ మతడు పూర్వ మొనర్చిన కర్మానుగుణఫలము నొసగ సమర్థముగా నుండును, అదియే సంకల్పిత శరీరమని యిట నుడువబడినది. జీవుడు తా జేసిన శుభాశుభ కర్మానుగుణముగనే తలంచును. అన్యము నతడు సంకల్పింపజాలడు. కావుననే ప్రాణము పోవునపుడు బంధువులెల్లరు జేరి యతనికి సత్సంకల్పము కల్పింప యత్నింతురు. కాని యది క్షణకాలములో నెల్ల భ్యస్త మగును.

"య ఏవం విద్వాన్ ప్రాణం వేద; న హాస్య ప్రజా
హీయతేఽమృతో భవతి, త దేష శ్లోకః." ౧౧

యః విద్వాన్=ఏ విద్వాంసుడు-వివేకి, ప్రాణం = ప్రాణమును, ఏవం వేద=ఇట్లు తెలిసికొనునో, హ - నిశ్చయముగా, అస్య - ఇతనికి, ప్రజా - సంతానము, న హీయతే - హీనముకాదు - వంశోచ్ఛేదముకాదు, అమృతః భవతి - అమరుడగును, తత్ ఏషః శ్లోకః - ఆవిషయమువకు ముందు రాబోవు శ్లోకము ప్రమాణ మగును.

ప్రాణమును గూర్చి యింతకు పూర్వ మెంతయో చెప్పబడినది. ఆప్రాణమహత్వమునే విద్వాంసుడు బాగుగా గుర్తించి దివామైథునాదులను వర్జించి, నియత జీవనము కలవాడై, యశుభ కర్మలను విడిచి, శుభ కర్మల నాచరించుచు ననాసక్తచిత్తుడై వర్తించునో యతడు చక్కనిసంతానము కలవాడై లోకమున ప్రసిద్ధు డగుటయేకాక శరీరత్యాగానంతరమున నమరుడై సుఖియించును. ఇందులకు గ్రంథాంతర ప్రమాణము నుదాహరించుచున్నాడు.

"ఉత్పత్తి మాయతిం స్థానం విభుత్వం చైవ పంచధా
అధ్యాత్మం చైవ ప్రాణస్య విజ్ఞాయామృత మశ్నుతే,
విజ్ఞా యామృత మశ్నుతే" ౧౨

ఉత్పత్తిం=పుట్టుకను ఆయతిం=ఆగమనమును, స్థానం=ఉండు స్థానమును, విభుత్వం చ=సర్వవ్యాపిత్వమును, పంచధా ఏవ=ఈ యైదు విధములను, ప్రాణస్య=ప్రాణముయొక్క, అధ్యాత్మం చ ఏవ=శరీరావస్థితిని, విజ్ఞాయ = బాగుగ నెఱిగి, అమృతం అశ్నుతే=అమరత్వమును బొందును - అనుభవించును.

పరమేశ్వరునివలన ప్రాణ మెట్లు పుట్టునో, ఏ యే కారణమున నీశరీరమునందు ప్రవేశించునో, అందు పాయ్వాది స్థానముల నెటనుండునో శరీరమునందంతటను నెట్లు వ్యాపించి యాయా కార్యముల నిర్వర్తించునో, యని యన్నియు బాగుగ తెలిసికొనిన వ్యక్తి యమరత్వమును సంపాదించి సుఖియింపగలడని భావము.

'విజ్ఞాయామృత మశ్నుతే' అను వాక్యమును రెండు పర్యాయములు ప్రయోగించి తృతీయ ప్రశ్న సమాప్తిని మహర్షి తెలిపినాడు.

తృతీయ ప్రశ్నము సమాప్తము

చతుర్థ ప్రశ్నము

"అథ హైనం సౌర్యాయణీ గార్గ్యః పప్రచ్ఛ భగవన్!
ఏతస్మిన్ పురుషే కాని స్వపంతి? కా న్యస్మిన్ జాగ్రతి?
కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి? కస్యైతత్ సుఖం
భవతి? కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవం తీతి." ౧

అథ=తరువాత, సౌర్యాయణీ=సూర్యుని ప్రపౌత్రుడు, గార్గ్యః=గర్గగోత్రుడు, ఏనం=పిప్పలాదుని, పప్రచ్ఛ=అడిగెను, భగవన్ ! = స్వామీ !, ఏతస్మిన్ పురుషే = ఈ శరీరేంద్రియాదులందు, కాని=ఏవి, స్వపన్తి=నిద్రించును, అస్మిన్ = ఈ శరీరమున, కాని జాగ్రతి = ఏవి మెలకువ - తెలివితో నుండును. వీని యన్నింటిలో, కతరః ఏషః దేవః= ఏ దేవత, స్వప్నాన్ = కలలను, పశ్యతి = చూచును?, కస్య = ఎవనికి, ఏతత్ సుఖంభవతి = ఈసుఖము కలుగును?, కస్మిన్ను = దేనిలో-ఎవని యందు, సర్వే = ఎల్లరు ప్రాణాది పదార్థము లన్నియు, సంప్రతిష్ఠితాః భవన్తి=బాగుగ స్థితిగలవి యగును?, ఇతి=అని ప్రశ్నించెను.

కౌసల్యుని ప్రశ్నకు సమాధానము లభించిన తరువాత గార్గ్యుడు పిప్పలాదుని సమీపించి ప్రశ్నించుచున్నాడు. భగవన్ ! ఈ శరీరమున నిద్రించున దెవరు? జాగ్రదవస్థలో నుండున దెవరు? కలలు గనున దెవరు? సుఖ మెవనికి గలుగును ? విశ్వమునందలి పదార్థము లన్నియు నెవని యందు బాగుగ స్థితిగల వగుచున్నవి ? అని యైదు ప్రశ్నలు గార్గ్యు డడిగినాడు. ఇందు మొదటి రెండు ప్రశ్నలు శరీరమునందలి ప్రాణము ఇంద్రియములకు సంబంధించినవని. తదుపరి రెండును జీవునకు సంబంధించినవి. చివరి యైదవప్రశ్న పరమేశ్వరునకు సంబంధించినదిగా భావింప నగును. పిప్పలాదుని సమాధానమునం దీ విషయములు స్పష్టము కాగలవు.

"తస్మై స హోవాచ, యథా గార్గ్య! మరీచయోఽ
ర్కస్యాస్తం గచ్ఛతః సర్వా ఏతస్మిన్ తేజోమండలే
ఏకీభవంతి, తాః పునః పున రుదయతః ప్రచరం త్యేవం
హ వై తత్ సర్వం పరే దేవే మన స్యేకీభవతి, తేన
తర్హ్యేష పురుషో న శృణోతి న పశ్యతి న జిఘ్రతి
న రసయతే న స్పృశతే నాభివదతే నాదత్తేనానందయతే
న విసృజతే నేయాయతే స్వపితీ త్యాచక్షతే." ౨

సః = పిప్పలాదమహర్షి, తస్మై = గార్గ్యునకు, హ ఉవాచ = చెప్పెను, గార్గ్యః అస్తం గచ్ఛతః = అస్తమించుచున్న, అర్కస్య = సూర్యుని, సర్వాః మరీచయః=కిరణములన్నియు, ఏతస్మిన్ తేజో మండలే =కనబడుచున్న తేజో మండలమునందే, యథా ఏకీభవంతి=ఎట్లు ఏకమగునో, తాః=ఆ కిరణములు, పునఃపునః ఉదయతః = మరల మరల ప్రతిదినము ఉదయించు సూర్యునితోబాటు, ప్రచరంతి = మరల వ్యాపించునో, ఏవం హవై=అట్లే, తత్ సర్వం=నేత్రాదీంద్రియ జాతమంతయు, పరే దేవే మనసి=సూక్ష్మము దివ్యమునగు మనస్సునందు, ఏకీభవతి = ఏకమగును లీనమగును, తేన=ఆ కారణముచే, తర్హి =అప్పుడు, ఏషః పురుషః=ఈ మనుష్యుడు; న శృణోతి, న పశ్యతి, న జిఘ్రతి, న రసయతే, న స్పృశతే, నాభివదతే = వినడు, కనడు, వాసనచూడడు, రుచి చూడడు. స్పృశింపడు, మాటలాడడు. నాదత్తే=పట్టుకొనడు గ్రహింపడు, నానందయతే=ఉపస్థేంద్రియసుఖము ననుభవింపడు. న విసృజతే = మల మూత్రములను విసర్జింపడు, న ఇయాయతే=నడవడు, స్వపితి ఇతి ఆచక్షతే=అట్టి యెడల నిద్రించుచున్నాడని చెప్పుదురు.

ఈ శరీరమునందు నిద్రించున దెవరు? అను గార్గ్యుని ప్రశ్నకు పిప్పలాదుడు సమాధానము చెప్పుచున్నాడు. శరీరమునందు నేత్రాది జ్ఞానేంద్రియములు, వాగాది కర్మేంద్రియములు, మనస్సు అను అంతఃకరణము

నున్నవి. వీనిలో నంతఃకరణము-మనస్సు దివ్యము: మిక్కిలి శక్తిమంతము. దాని ననుసరించియే తక్కిన నేత్రాదీంద్రియములు స్వవ్యాపారములు నిర్వర్తించును. మనస్సు పనిచేయకున్న జ్ఞానకర్మేంద్రియము లేవియు పని చేయవు సూర్యునితోబాటు అతని కిరణములు వర్తించునట్లు ఇంద్రియములు మనస్సు ననుసరించి వర్తించునని యట చెప్పబడినది, నిద్ర తమోగుణ కార్యము. మనస్సు తమోవృత్తిచే నాక్రమింపబడినపుడు అది చలింపదు. అప్పుడితరేంద్రియము లేవియు తమ పనులను చేయవు. అదియే నిద్ర. మనుజుడు నిద్రించుచున్నాడందురు. సుశ్రుత శారీరమున నిట్లున్నది.

"హృదయం చేతనాస్థాన ముక్తం సుశ్రుత! దేహినామ్
తమోఽభిభూతే తస్మింస్తు నిద్రాఽవిశతి దేహినామ్."

'ప్రాణులకు హృదయము చేతనాస్థానము. ఆ హృదయము తమోగుణముచే నావరింపబడినపుడు నిద్ర కలుగును'.

"ప్రాణాగ్నయ ఏవై తస్మిన్ పురే జాగ్రతి గార్హపత్యో
హ వా ఏషోఽపానో వ్యానోఽన్వాహార్యపచనో యద్
గార్హపత్యాత్ ప్రణీయతే ప్రణయనాదాహవనీయః ప్రాణః.'3

ఏతస్మిన్ పురే=ఈ శరీరరూప పురమునందు, ప్రాణాగ్నయః ఏవ =ప్రాణరూపములగు అగ్నులే. జాగ్రతి = స్వ వ్యాపారములను జేయుచుండును. ఏషః అపానః=గుదాస్థానవర్తియగు అపానము, గార్హపత్యః హ వై=గార్హపత్యాగ్ని, వ్యానః=వ్యానము, అన్వాహార్య పచనః = దక్షిణాగ్ని, యత్ గార్హపత్యాత్ ప్రణీయతే=గార్హపత్యాగ్నినుండి తేబడినందున, ప్రణయనాత్ = ఉద్ధరణ కారణమువలన, ప్రాణః=ప్రాణము, ఆహవనీయః=ఆహవనీయాగ్ని.

పురుషుడు నిద్రించునపుడు - ఇంద్రియాదులు స్వస్వ వ్యాపారములను విడిచి మనస్సుతోబాటు తమోగుణముచే పరిభూతములై నిశ్చేష్టితములై

యున్న కాలమున జాగ్రదవస్థలో నుండున దెవరు? అను ప్రశ్నకు సమాధానము చెప్పబడినది. సుషుప్త్యవస్థయందు ప్రాణము, అపానము, వ్యానము జాగ్రదవస్థలో నుండును ప్రాణాదులు స్వవ్యాపారము నిర్వర్తించుచుండు నని భావము.

(ఇట ప్రాణాదులను అగ్నులతో పోల్చి చెప్పబడినది. అపానము గార్హపత్యాగ్నితోను. వ్యానము దక్షిణాగ్నితోను, ప్రాణము ఆహవనీయాగ్నితోను పోల్చి వర్ణించుచున్నాడు. ఇందు గార్హపత్యాగ్ని మిగిలిన అగ్నుల కాధారముగా ఎంచబడును. గార్హపత్యాగ్నినుండి అన్నాదులను పచనము చేయుటకు వంటయింటిలోనికి తేబడిన అగ్ని అన్వాహార్యమనబడును. ఆ గార్హపత్యమునుండి అగ్నిహోత్రాదులను జేయుటకు తేబడిన యగ్ని ఆహవనీయాగ్ని యనబడును. కావున గార్హపత్యాగ్ని మిగిలిన అగ్నుల కాధార మనుట సత్యము గృహపతిచే విధిపూర్వకముగా నాధానము చేయబడిన అగ్ని గార్హపత్యాగ్ని యనబడును. పత్నీసంయాజాది శ్రౌత కర్మకు సాధనమగు స్త్రీ గృహపదముచే చెప్పబడును. అట్టి స్త్రీయొక్క పతి గృహపతి యనబడును. పత్నీసమేతునకే గార్హపత్యాగ్ని నాధానముచేయుట కధికారము కలదని గుర్తింపవలయును అట్టి గార్హపత్యాగ్నినుండియేఅగ్నిని తీసికొని వచ్చి దక్షిణాగ్ని -పాకాగ్ని. ఆహవనీయాగ్నికార్యము లాచరింపబడును. శరీరమునందలి గుదాస్థానీయమగు అపానము నిమ్నస్థానమున నుండి ప్రాణాదుల కాధారమగుచున్నది. గార్హపత్యమునుండి ఆహవనీయాది కార్యములకు అగ్ని ప్రణయనము చేయబడినట్లు అపానమునుండి పైకి ప్రణయనము చేయబడును కావున ప్రాణమనబడుచున్నది అపానమునుండి వెలువడి ప్రాణము ఊర్ధ్వమున నాసికాదులందు ఉచ్ఛ్వాస నిఃశ్వాసరూపమున కార్యకారి యగుచున్నది. హృదయ దక్షిణ భాగమునుండి వెలువడి వ్యానము శరీరమునం దంతటను తన వ్యాపారమును నడపును కావున దక్షిణ పదసామ్యముతో దక్షిణాగ్నిగా వర్ణింపబడినదని గుర్తింపవలయును.

"యదుచ్ఛ్వాస నిశ్శ్వాసావేతా వాహుతీ సమం
నయతీతి స సమానః, మనో హ వావ యజమాన
ఇష్టఫల మేవోదానః, స ఏనం యజమాన
మహరహర్ బ్రహ్మ గమయతి." ౪

ఏతౌ ఉచ్ఛ్వాస నిఃశ్వాసౌ = ఉచ్ఛ్వాస నిఃశ్వాసములను రెంటిని, ఆహుతీ=ఆహుతిరూపమున, యత్ సమం నయతి=సమముగా నడపుట వలన, సః సమానః ఇతి=అది సమాన మనబడును, మనః హ వావ = జీవాత్మయే, యజమానః = యజమానుడు - యజ్ఞకర్త, ఇష్టఫలమ్ ఏవ ఉదానః=అభీష్టఫలమే ఉదానము, సః = ఆ ఉదానము, ఏనమ్ = మనో రూప యజమానుని, అహరహః = ప్రతిదినము, బ్రహ్మ గమయతి = బ్రహ్మమును జేర్చును.

సమాననామక ప్రాణము నాభిస్థానమున నుండి ఉచ్ఛ్వాస నిఃశ్వాసములు క్రమముగా సమముగ నడచుటకు హేతువగుచున్నది. ఉచ్ఛ్వాసమున కెంతకాలము పట్టునో నిఃశ్వాసమునకును నంతే సమయము పట్టును. అయ్యవి రెండును సమముగా నడచుచుండును అప్పుడే శరీరస్థితి కెట్టి హానియు నుండదు. వానిని సామ్యమున నడపును కావున నాభిస్థవాయువు సమానమనబడు నని భావము ఈ యుచ్ఛ్వాస నిశ్శ్వాసములు యజ్ఞమున వేయబడు ఆహుతులతో బోల్చబడి యాహుతు లనబడినవి. యజ్ఞమున యజమానుడుండును. ఆహుతుల నిచ్చుట - ఇట శరీరమున నాహుతుల నిచ్చు యజమానుడు జీవాత్మ. అది మనోనామమున బేర్కొనబడినది. (మనుతే జానాతి ఇతి మనః) జీవుడు తెలిసికొనువాడు కావున మనఃపదము చే చెప్పబడినాడు. యజ్ఞము ఫలము నపేక్షించి చేయుదురు. ఆ యభీష్టఫలము నిచ్చువాడు పరమేశ్వరుడు. ఇట నీ యజ్ఞమునం దభీష్టఫలము ఉదానము. యజమానుడైన జీవాత్మ నిత్యము ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములను సమాన సాహాయ్యముతో సమానముగా నడపుచు ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములను వశ

పఱుచుకొని, ఉదాన సహాయ్యముతో సమాధిస్థుడగును. కావున ఉదానము క్రమముగా బ్రహ్మప్రాప్తి కలిగించునని యిట వర్ణింపబడినది.

"అత్రైష దేవః స్వప్నే మహిమాన మను భవతి, యద్
దృష్టం దృష్ట మనుపశ్యతి శ్రుతం శ్రుత మేవార్థ
మను శృణోతి, దేశ దిగంతరైశ్చ ప్రత్యనుభూతం
పునః పునః ప్రత్యను భవతి, దృష్టం చాదృష్టం చ
శ్రుతం చాను శ్రుతం చానుభూతం చాననుభూతం చ
స చ్చాసచ్చ సర్వాం పశ్యతి సర్వః పశ్యతి." 5

అత్ర స్వప్నే=స్వప్నమునందు, ఏషః దేవః=ఈ జీవుడు, మహిమానం=మహత్వమును, అనుభవతి=అనుభవము చేసికొనును. యత్ దృషమ్ దృష్టమ్=ఏది జాగ్రదవస్థలో నేత్రాదీంద్రియములచే చూడబడినదో, అనుపశ్యతి=స్వప్నమున చూచును, శ్రుతం శ్రుతం ఏవ అర్థం = వినిన అర్థమును, అను శృణోతి=వినును, దేశ దిగంతరైః చ=ప్రదేశములందును దిక్కులందును, ప్రత్యనుభూతం = ప్రత్యేకముగా ననుభవించినదానిని, పునః పునః ప్రత్యనుభవతి=మరల మరల అనుభవించును, దృష్టం శ్రుతం అనుభూతం సత్ చ = చూచి, విని, అనుభవించి, ఉన్న విషయములను మరల స్వప్నమున ప్రత్యక్షముగ చూచినట్లు, వినినట్లు, అనుభవించి, ఉన్నట్లు ఎఱుగును. అదృష్టం అశ్రుతం అననుభూతం అసత్ చ=ఈ జన్మలో కాక జన్మాంతరములందు చూచి, విని, అనుభవించి, ఉన్నది అని యెఱిగిన వానినికూడ ఇప్పుడు స్వప్నమునందు,సర్వం పశ్యతి=అంతయు చూచును, సర్వః=అట్లే ప్రాణివర్గమంతయు, పశ్యతి= స్వప్నమున జూచును.

స్వప్నము జాగ్రత్ సుషుప్త్యవస్థలకు మధ్యనుండు అవస్థ. అప్పుడు ఇంద్రియములు పనిచేయవు. అవి మనస్సుతోబాటు పనిచేయుట మానుకొనినపుడు నిద్రావస్థయేర్పడకముందు స్వప్నావస్థ యేర్పడును. ఆసమయము

శరీర రక్షణార్థము ప్రాణాదులు స్వవ్యాపారముల నొనరించుచుండును. గాఢ నిద్ర యేర్పడుటకుముందు కలలు కననగును. జాగ్రదవస్థలో చూచి, విని అనుభవించి యున్న సద్వస్తువులను స్వప్నదశలో ప్రత్యక్షముగ చూచి నట్లు, వినినట్లు, అనుభవించినట్లు అగును. ఈ కలలు కనునదెవరు? అను ప్రశ్నకు సమాధానముగ పిప్పలాదుడు ఆత్మ కీ కలలు ఏర్పడుననుచున్నాడు. జీవాత్మ యే జాగ్రదవస్థలో ననుభవించిన పదార్థములను మరల అనుసంధానము చేయును. ప్రత్యక్షానుభవము వలెనే యుండును. జాగ్రదవస్థలో జీవుడు విషయముల నెఱిగినపుడు వానికి సంబంధించిన సంస్కారములు-వాసనలు అంతఃకరణమున నేర్పడును. స్వప్నావస్థలో ఆ సంస్కారములతో సంబంధమేర్పడుటచే జీవునకు మరల వా విషయములు ప్రత్యక్షము లయినట్లగును. స్వప్న మొక విధమగు స్మృతియన నొప్పును. స్మరణ జాగ్రదవస్థలో కలుగును. ఇయ్యది స్వప్నావస్థ, సంస్కార జన్యజ్ఞానము ఉభయత్ర సమానమే. కలలో కొన్నియెడల, నీ జన్మమున జాగ్రదవస్థలో కని విని యెఱుగని విషయములను గాంచుటయు, వినుటయు, ననుభవించుటయు జరుగును. అట్టివి పూర్వజన్మమున నా జీవాత్మ యనుభవించిన విషయములుగా తెలిసికొనవలయును అవియేయిందు 'అదృష్ట మశ్రుతమనను భూత' పదములచే బేర్కొనబడినవి. ఇట్టి కలలు ఒకే ప్రాణికి కాక ఎల్ల ప్రాణులకు సంభవించును. గర్భస్థ శిశువునకు గూడ స్వప్నస్థితియుండును. అక్కడ జీవాత్మ పూర్వజన్మానుభూత విషయములనే అనుభవించును పుట్టిన తదుపరికూడ నైదు సంవత్సరముల వఱకు జన్మాంతరానుభూత విషయములనే జీవాత్మ స్వప్నమునందు జూచును. పూర్వ జన్మలందు నేత్రాదీంద్రియములతో ననుభవించిన వాని నీ జన్మపు స్వప్నమున నెట్లు చూచునని సంశయింపబనిలేదు. స్వప్నములు మనస్సునం దేర్పడును. ఆ మనస్సు పూర్వ జన్మమునందును ఈజన్మమునందును జీవునకొక్కటియేయుండును. పూర్వ శరీరేంద్రియ గోళకములు నశించినను మనస్సు అదియే యుండును. సూక్ష్మేంద్రియములు నుండును, కావున దోషములేదు. పూర్వజన్మ దృష్ట

ములు ఇప్పుడు ప్రత్యక్ష దృష్టములు కావు కాబట్టి యవి అదృష్ట అశ్రుత అననుభూత పదములచే బేర్కొనబడుటయు ఉచితమే.

“స యదా తేజసాభిభూతో భవతి అత్రైష దేవః
స్వప్నాన్న పశ్యత్యథ తదైతస్మిఞ్ ఛరీరఏతత్ సుఖం
భవతి.”౬

సః=ఆజీవుడు, యదా=ఎప్పుడు, తేజసా=తేజస్సుచే, అభిభూతః భవతి=ఆచ్ఛాదితుడగునో అప్పుడు సుషుప్తావస్థ యేర్పడును. అత్ర = ఆ సుషుప్తావస్థలో, ఏషః దేవః=ఈ జీవాత్మ, స్వప్నాన్ న పశ్యతి = కలలుగనడు అథ=అనంతరమున, అస్మిన్ శరీరే = ఈ శరీరమునందు, తదా=సుషుప్తావస్థలో నున్నపుడు, ఏతత్ సుఖం భవతి = పరమాత్మతో జీవాత్మకు కలిగిన సంబంధమువలన గలుగు సుఖము కలుగును బ్రహ్మము నందలి ఆనందము ననుభవించును. అయినను నిద్ర తమోగుణ ప్రధానమైన దగుటవలన జీవాత్మ యా సుఖమును జ్ఞానపూర్వకముగ ననుభవింపడు

సుఖమెవరికి కలుగును? అను నాలుగవ ప్రశ్నకు సమాధానమున పిప్పలాదు డిట్లు చెప్పుచున్నాడు.

సమాధి యందును సుషుప్తి యందును చిత్తవృత్తి నిరోధ మేర్పడును చిత్తము వృత్తిరహితమై యది లేనట్లుండును. సమాధియందు చిత్తమున సత్వగుణ మతివృద్ధమై రజస్తమములు నామమాత్రములై తిరోభవించును సుషుప్తావస్థయందు చిత్తమున సత్వరజస్సులు తమోగుణముచే నభిభూతములై యుండును, ఇదియే భేదము. కాని, చిత్తస్థైర్య ముభయత్ర సమానమే యనవచ్చును. కావున జీవాత్మ స్వస్వరూపమున పరమేశ్వరుని యందు స్థితి కలవాడగును. అందువలననే పతంజలి మహర్షి ‘చిత్తవృత్తి నిరోధము కలిగినపుడు జీవాత్మకు ద్రష్టయగు పరమేశ్వరునియందు స్థితి కలుగు’నని సూత్రించియున్నాడు. ‘తదా ద్రష్టుఃస్వరూపేఽవస్థానమ్’.

సమాధియందు జీవుడు బ్రహ్మానందము ననుభవించును. సుషుప్తియందు తమోవృత్తి కారణముగ బ్రహ్మానందము ననుభవించియు తెలిసికొనలేడు. కాని సుషుప్తినుండి జాగ్రదవస్థకు వచ్చినపుడు సుషుప్తిలో నేదియో విలక్షణసుఖము ననుభవించి నట్లూహించును. సుఖముగా నిద్రించితి ననును కాబట్టి సుషుప్తియందు సుఖమనుభవించునది జీవాత్మయే.

"స యథా సోమ్య వయాంసి వాసో వృక్షం సంప్రతిష్ఠంతే,
ఏవం హ వై తత్ సర్వం పర ఆత్మని సంప్రతిష్ఠతే." ౭

సః పిప్పలాదు డనుచున్నాడు, సోమ్యః = ప్రియదర్శనుడా! వయాంసి=పక్షులు, వాసః వృక్షం=తమ నివాసస్థానమగు వృక్షమునందు, సంప్రతిష్ఠంతే=రాత్రియందు బాగుగ నివసించును, ఏవమ్ హ వై తత్ సర్వం=ఇట్లే ముందు చెప్పబోవున దంతయు, పరే ఆత్మని = పరమేశ్వరునియందు, సంప్రతిష్ఠతే=ఎల్లప్పుడు బాగుగ స్థితిగలదై యుండును.

ఎక్కడ సర్వము సంప్రతిష్ఠితమై యుండును? అని కౌసల్యు డడిగిన అయిదవ ప్రశ్నకు సమాధానము పిప్పలాదుడు సోమ్యపదముతో కౌసల్యుని సంబోధించి చెప్పదొడగినాడు. రాత్రి సమీపింపగానే పక్షులన్నియు తమ వాసస్థానములగు వృక్షములం జేరియుండునట్లు ప్రపంచమునందలి పదార్థములు-సర్వప్రపంచము పరమేశ్వరునియందే స్థితమై యుండును. ఆపదార్థ సర్వస్వ మేదియో ముందు వివరించుచున్నాడు.

"పృథివీ చ పృథివీ మాత్రా చాప శ్చాపోమాత్రా చ తేజశ్చ తేజోమాత్రా చ వాయుశ్చ వాయుమాత్రా చాకాశశ్చాకాశ మాత్రా చ చక్షుశ్చ ద్రష్టవ్యం చ శ్రోత్రం చ శ్రోతవ్యం చ ఘ్రాణం చ ఘ్రాతవ్యం చ రస శ్చ రసయితవ్యం చ త్వక్ చ స్పర్శయితవ్యం చ వాక్ చ వక్తవ్యం చ హస్తౌ చాదాతవ్యం చోపస్థ శ్చానందయితవ్యం చ పాయు శ్చ విసర్జయితవ్యం చ పాదౌ చ గంతవ్యం చ మన శ్చ

మంతవ్యం చ బుద్ధి శ్చ బోద్ధవ్యం చ అహంకార శ్చాహం కర్తవ్యం చ చిత్తం చ చేతయితవ్యం చ తేజ శ్చ విద్యోత యితవ్యం చ ప్రాణ శ్చ విధారయితవ్యం చ." ౮

పృథివ్యాది పంచస్థూల సూక్ష్మభూతములు, నేత్రాది జ్ఞానేంద్రియములు వానిచే గ్రహింపబడు శబ్దస్పర్శాది విషయములు, కర్మేంద్రియములు వానిచే నొనర్పబడు కర్మలు,అంతరింద్రియమగు మనస్సు, దానిచే మననము చేయదగు విషయము, ఇట్లే బుద్ధి చిత్తాహంకారములు వాని విషయములు, తేజస్సు దానిచే ప్రకాశింప జేయబడునది, ప్రాణము దానిచే ధరింపబడునది, అంతయు పరమేశ్వరునియందే స్థితమైయుండును. స్థూల సూక్ష్మ ప్రపంచమున కంతటికి పరమేశ్వరుడే ఆధారము. ఈస్థూల సూక్ష్మాత్మక జడజగత్తే కాక జీవాత్మలును పరమేశ్వరునియందే యుండునని చెప్పబోవు చున్నాడు.

"ఏష హి ద్రష్టా శ్రోతా స్ప్రష్టా ఘ్రాతా రసయితా
మంతా బోద్ధా కర్తా విజ్ఞానాత్మా పురుషః,
స పరే అక్షరే ఆత్మని సంప్రతిష్ఠతే." ౯

ఏషః హి=శరీరమునందుండు నీతడు (జీవుడు), ద్రష్టా=కన్నులతో చూచువాడు, శ్రోతా=శ్రవణేంద్రియములతో శబ్దాదులను వినువాడు స్ప్రష్టా=త్వగింద్రియముతో స్పృశించువాడు, ఘ్రాతా = నాసికతో గంధమును గ్రహించువాడు, రసయితా=జిహ్వతో రుచుల నాస్వాదించువాడు, మన్తా=మనస్సుతో నాలోచించువాడు, బోద్ధా=బుద్ధితో తెలిసికొనువాడు, కర్తా = కర్మలను హస్తపాదాదులతో నాచరించువాడు, విజ్ఞానాత్మా = విజ్ఞాన స్వరూపుడునగు, పురుషః=శరీరరూపమున శయించు జీవు డెవడు కలడో, సః=అతడును, పరే=అత్యంత సూక్ష్మము, అక్షరే = నాశరహితము, ఆత్మని = వ్యాపకమగు నా పరమాత్మయందే, సంప్రతిష్ఠతే = స్థితుడై యుండును.

శరీరమున గల నానావిధేంద్రియాదులతో నానావిధ కర్మల నొనర్చు జీవాత్మయు నాశరహితము, నత్యంత సూక్ష్మము,వ్యాపకమునగు పరమాత్మ యందే స్థితిగలిగి యుండును. జీవ ప్రకృతుల కన్నింటికి పరమాత్మయే యాధార మని భావము.

"పరమే వాక్షరం ప్రతిపద్యతే స యో హ వై తదచ్ఛాయ మశరీర మలోహితం శుభ్ర మక్షరం వేదయతే యస్తు సోమ్య! స సర్వజ్ఞః సర్వో భవతి, తదేష శ్లోకః." ౧౦

సోమ్య!=ప్రియదర్శన! గార్గ్య! యః = ఏ విద్వాంసుడు, తత్ అచ్ఛాయమ్=ఆ ఛాయారహితము, అశరీరం=శరీరరహితము, అలోహితం=రక్తరహితము, శుభ్రం=శుద్ధము, అక్షరం = నాశరహితము నగు పరమాత్మను, వేదయతే=ఎఱుగునో, సః హవై=అతడు నిశ్చయముగ, పరమ్ అక్షరమ్ ఏవ=సూక్ష్మాతి సూక్ష్మము అవినశ్వరమునగు నీశ్వరునే, ప్రతిపద్యతే=పొందును. స సర్వః=అట్టివారెల్లరు, సర్వజ్ఞః = సర్వజ్ఞులు, భవతి=అగుదురు, తత్ ఏషః శ్లోకః=అందుల కీ శ్లోకము ప్రమాణము

పరమేశ్వరునకు శరీరములుకాని, తదంగములయిన రక్తాదులుకాని, ఛాయాదులుకాని యుండవు. అతడు శుద్ధబుద్ధ ముక్తస్వభావుడు. నాశరహితుడు. అతి సూక్ష్ముడు. అట్టి వానిని విద్వాంసులు బ్రహ్మచర్యాది వ్రతానుష్ఠానాదులవలన నెఱిగి సర్వజ్ఞులగుదురు. ముక్తులై యతనినే పొందుదురు. ఇందులకు ప్రమాణముగా నీ క్రింది శ్లోకము నిట నుల్లేఖించుచున్నాడు.

"విజ్ఞానాత్మా సహ దేవైశ్చ సర్వైః ప్రాణా భూతాని సంప్రతిష్ఠంతి యత్ర, తదక్షరం వేదయతే యస్తు సోమ్య! స సర్వజ్ఞః సర్వమే వావివేశేతి." ౧౧

సోమ్య! = గార్గ్య!, యః తు విజ్ఞానాత్మా=విజ్ఞాన స్వరూపుడగు జీవుడు, సర్వైః దేవైః సహ=విషయ ప్రకాశములగు సర్వేంద్రియము

లతోగూడ, ప్రాణాః భూతాని చ = పంచప్రాణములు, పంచభూతములు నన్నియు, యత్ర = ఎవనియందు, సంప్రతిష్ఠంతి = బాగుగ స్థితిగలిగి యున్నవో, తత్ అక్షరం= ఆ నాశరహిత పరమేశ్వరుని, యస్తు వేదయతే =ఎవడెఱుగునో, సః= అతడు, సర్వజ్ఞః=సర్వము-ప్రాకృతిక ప్రపంచము నంతటిని నెఱిగినవాడై, సర్వం=సర్వవ్యాపకమగు పరమేశ్వరునందు, ఆవివేశ=ప్రవేశించును-బంధముక్తుడై యాత్మానందము ననుభవించు నని భావము. ఇతి=ప్రశ్న సమాప్తి సూచకము.

పిప్పలాదుడు తా జెప్పిన విషయమునకు ప్రమాణముగా గ్రంథాంతర శ్లోకము నుదహరించుచున్నాడు ఇంద్రియ శక్తులతోబాటు జీవుడు, ప్రాణములు, భూతములు నన్నియు నే పరమేశ్వరునందు స్థిరములై యుండునో యట్టి పరమేశ్వరు నెఱిగినవాడు సర్వజ్ఞుడై ముక్తుడగును. ఆ పరమేశ్వరు నందే ప్రవేశించి ఆనందము ననుభవించును.

చతుర్థ ప్రశ్నము సమాప్తము.

పంచమ ప్రశ్నము

"అథ హైనం శైబ్యః సత్యకామః పప్రచ్ఛ, స యో హ
వై తద్ భగవన్! మనుష్యేషు ప్రాయణాంత మోంకార
మభిధ్యాయీత కతమం వావ స తేన లోకం జయతీతి." ౧

అథ హ=గార్గ్యుని ప్రశ్నానంతరము, ఏనం=పిప్పలాదమహర్షిని జేరి, శైబ్యః సత్యకామః=శిబిపుత్రుడు సత్యకాముడు, పప్రచ్ఛ=ప్రశ్నించెను, భగవన్!=స్వామీ!, మనుష్యేషు=మనుష్యులందు, హ వై యః సః=ఎవడు, ప్రాయణాంతం=యావజ్జీవము, ఓంకారమ్ = ఓంకారవాచ్యమగు బ్రహ్మమును, అభిధ్యాయీత=ధ్యానముచేయునో, సః=అతడు, తేన=ఆ ధ్యానముతో, కతమం లోకం=ఏ లోకమును, వావ = నిశ్చయముగ, జయతి ఇతి=జయించును, అని యడిగెను.

పిప్పలాదుడు గార్గ్యుని ప్రశ్నకు సమాధానము చెప్పిన పిదప శిబి కుమారుడు సత్యకాముడు మహర్షి నిట్లు ప్రశ్నించెను 'భగవన్! మనుష్యులలో నెవడేని యావజ్జీవము-జన్మాది మరణ పర్యంతము బ్రహ్మచర్యపాలన మొనర్చి సత్యహింసాది వ్రతముల నాచరించుచు ఓంకారపదవాచ్య బ్రహ్మమును నిష్ఠతో ధ్యానించునేని,అతడు పొందులోక మెయ్యది? దేనిని జయించును? ఆ ధ్యానమువలన నతని కెట్టిఫలము కలుగునో? చెప్పవలసినది,అని

"తస్మై స హోవాచ, ఏతద్ వై సత్యకామ!
పరం చాపరం చ బ్రహ్మ యదోంకారః, తస్మాద్
విద్వా నేతేనై వాయతనే నైకతర మన్వేతి." ౨

తస్మై=ఆ సత్యకామునకు, సః = పిప్పలాదుడు, హ ఉవాచ = ప్రకటముగా నిట్లు చెప్పెను, సత్యకామ! వై=నిశ్చయముగ, యత్ పరం చ అపరం చ బ్రహ్మ=పరము అపరము నను బ్రహ్మమెయ్యది కలదో,

ఏతత్ ఓంకారః=అది ఈఓంకార పదవాచ్యమే, తస్మాత్ = అందువలన, విద్వాన్=జ్ఞానియైనవాడు, ఏతేన ఏవ ఆయతనేన = ఈ యాలంబనము చేతనే, ఏకతరమ్=పరాపరము లను రెండిటిలో నొకదానిని, అన్వేతి = పొందును,

వాస్తవమున బ్రహ్మమున పరాపర భేదము కల్పితమే కాని యథార్థముకాదు. బ్రహ్మమునందు ద్వివిధభేదములేదు. సాంసారిక సుఖముల నభిలషించి పరమేశ్వరు నుపాసించువారి కట్టి ఫలములనే యొసంగును. పరమసుఖము-మోక్షానందము నభిలషించి యుపాసించువారి కట్టి ఫలమునే యొసంగును. సాంసారిక సుఖముల నొసంగు బ్రహ్మము అపరమనియు, ముక్తిఫలము నొసంగునది పర మనియు కల్పిత వ్యవహారము. కొందఱు ఇట ఓంకారపదము స్థూలమగుటచే నది అపర బ్రహ్మమనియు, తద్వాచ్యమగు పరమతత్త్వము పరబ్రహ్మ మనియు కల్పింతురు. ధ్యానమున కాలంబముగ ఓంకారమును గ్రహించి సాంసారిక సుఖము నభిలషించు వారి కట్టి సుఖప్రాప్తియే కలుగుననియు, పరముసుఖము పరమానందము నభిలషించి ఓంకారాలంబనముతో బ్రహ్మమును ధ్యానము చేయువారికి పరమ సుఖప్రాప్తియే కలుగుననియు మహర్షి యభిప్రాయము

''స యద్యేక మాత్ర మభిధ్యాయీత, స తేనైవ సంవేదిత
స్తూర్ణమేవ జగత్యా మభిసంపద్యతే తమ్ ఋచో
మనుష్యలోక ముపనయంతే, స తత్ర తపసా
బ్రహ్మచర్యేణ శ్రద్ధయా సంపన్నో మహిమానమనుభవతి.''3

సః=ఆ భక్తుడు, యది ఏకమాత్రం=ఏకమాత్రను, అభిధ్యాయీత =ధ్యానించినట్లయిన, సః అతడు, తేన ఏవ=దానితోనే, సంవేదితః = జ్ఞానయుక్తుడై, తూర్ణమ్ ఏవ = శీఘ్రముగానే, జగత్యామ్=లోకమున, అభిసంపద్యతే=సంపన్నుడగును, తమ్=అతనిని, ఋచః = ఋక్కులు,

మనుష్యలోకం = మానవలోకమును, ఉపనయంతే=ప్రాప్తింపజేయును. సః=అతడు, తత్ర = ఆ మనుష్యలోకమున, తపసా = తపస్సుతోను, బ్రహ్మచర్యేణ-బ్రహ్మచర్యముతోను, శ్రద్ధయా-శ్రద్ధతోను. సంపన్నః-కూడినవాడై, మహిమానమ్ అనుభవతి-మహిమను అనుభవించును.

శిష్టులు 'ఓమ్' నందు ఋగ్ యజుస్సామములు సమానిష్టములై యున్నట్లును: వేదత్రయసారమే ఓంకారము అనియు నెంచుదురు. మను స్మృతికారుడు నిట్లే యభిప్రాయ పడుచున్నాడు.

"అకారం చాప్యుకారం చ మకారం చ ప్రజాపతిః,

వేదత్రయాన్నిరదుహద్ భూర్ భువః స్వరితీతి చ." మనుః,

కావున ఓంకారము వేదత్రయ రూపమన నగును. వేదములందు కర్మ, ఉపాసన, జ్ఞానము నను విషయములు ముఖ్యముగా ప్రతిపాదింపబడినవి. భూలోకము, భువర్లోకము, స్వర్లోకము క్రమముగా నా విషయములకు సంబంధించినవి. లోకమున నెవడేని సాంసారిక సుఖాదులను ఐశ్వర్యాదులను గోరి, ఏషణత్రయములు గలవాడై యొకింత బ్రహ్మము నుపాసించుచు సత్కర్మల నాచరించునెడల నతనికి కొంత బ్రహ్మజ్ఞానము కలుగును. ఇదియే యేక మాత్రోపాసనకు ఫలము. ఋగ్వేదము ఓంకారమున అకార మాత్రారూపము. అకార రూపమగు నేకమాత్రోపాసన - అనగా ఋగ్వేదము మూలమున జగద్విజ్ఞానము సంపాదించుట యననగును. ఋగ్వేదము పదార్థవిజ్ఞానము గలిగించును. బ్రహ్మము నేకమాత్రోపాసనచేయుట యన నల్పముగా బ్రహ్మమును ధ్యానించుట యని భావము. అంత మాత్రమున మనుష్యుడు లోకజ్ఞానము కలవా డగును. అతడు సంపన్ను డగును. మానవులమధ్య ప్రతిష్ఠితు డగును. మహిమావంతుడై లోకమున నెల్లరిచే నాదరింపబడును. కాని, అతడు ఇంద్రియ నిగ్రహము కలవాడై, బ్రహ్మచర్యమును విడువక, సత్యవ్రతుడై యుండనగును. బ్రహ్మోపాసకున కీ గుణము లత్యావశ్యకములు.

"అథ యది ద్విమాత్రేణ మనసి సంపద్యతే
సోఽన్తరిక్షం యజుర్భి రున్నీయతే సోమలోకం,
స సోమలోకే విభూతి మనుభూయ పున రావర్తతే." ౪

అథ=తదుపరి, యది ద్విమాత్రేణ='అ, ఉ' అనెడి రెండు మాత్రలతో, మనసి=మనస్సునందు, ధ్యానము చేసినట్లయిన, ఉపాసకుడు, సంపద్యతే=మనోనిశ్చలతతో గూడినవా డగును, సః=అతడు, యజుర్భిః = ద్వితీయ మాత్రారూపమగు యజుస్సుల ద్వారమున, సోమలోకం=చంద్రలోకమును, ఉన్నీయతే=ప్రాపింప జేయఁబడును, సః = అతడు, సోమలోకే=సోమలోకమున, విభూతిమ్ అనుభూయ=ఐశ్వర్యము ననుభవించి, పునః ఆవర్తతే=తిరిగి వచ్చును.

ఓంకారగత అకార ఉకారము లనెడి ద్విమాత్రవాచ్య బ్రహ్మమును మనస్సున ధ్యానించువాడు చిత్తప్రసన్నతను సంపాదించును అతనిమనస్సు విక్షేపాదులు లేనిదై శాంతిని వహించును ఋగ్వేదము మూలమున పదార్థ విజ్ఞానము సంపాదించి, యజుర్వేద విహితములగు జ్యోతిష్టోమాది కర్మలను ఆచరించుచు బ్రహ్మము నుపాసించు వ్యక్తిమనస్సు నిశ్చలమై శాంతిని వహించును. ఈస్థితియే సోమలోకప్రాప్తి యని యిట వర్ణింపబడినది. శాంతచిత్తుడైన వ్యక్తి లోకమున సౌమ్యభావమును పెంపొందింపజేయును. శాంతస్వభావుడై మెలగును. విశిష్ట సుఖముల ననుభవించును. భౌతిక సంపద లెన్నియున్నను చిత్తశాంతి లేని మనుజు డంతగా సుఖింపజాలడు. ఇయ్యది లోకవిదితమే. కావున ద్విమాత్రోపాసకుడు-జ్ఞానవంతుడై శుభ కర్మల నాచరించుచు బ్రహ్మ నధికముగా నుపాసించువాడు స్వస్థచిత్తుడై సుఖము ననుభవించునని భావము. ఆ స్థితినుండి తొలగినపుడు సాధారణ వ్యక్తి యగును. ఇదియే చంద్రలోకమునుండి తిరిగివచ్చుట.

"యః పున రేతం త్రిమాత్రేణై వోమి త్యనేనై వాక్షరేణ
పరం పురుష మభిధ్యాయీత, స తేజసి సూర్యే సంపన్నః,

యథా పాదోదర స్త్వచా వినిర్ముచ్యత ఏవం హ వై
స పాప్మనా వినిర్ముక్తః స సామభి రున్నీయతే బ్రహ్మలోకం;
స ఏతస్మా జ్జీవఘనాత్ పరాత్పరం పురిశయం
పురుష మీక్షతే, త దేతౌ శ్లోకౌ భవతః." 5

యః పునః=ఎవడు, ఏతత్ త్రిమాత్రేణ ఓమ్ ఇతి అనేన అక్షరేణ ఏవ=ఈ త్రిమాత్రాత్మక మగు ఓ మ్మను నక్షరముతోనే, పరం పురుషం అభిధ్యాయీత = సూక్ష్మాతి సూక్ష్మమగు పూర్ణబ్రహ్మము నుపాసించునో-ధ్యానించునో, సః=అతడు, తేజసి సూర్యే = తేజోవర్ధకమగు మూర్ధము నందలి ప్రాణమునందు, సంపన్నః=విశేషశక్తియుక్తు డగును. యథా పాదోదరః=సర్పము, త్వచా వినిర్ముచ్యతే=కుబుసమునుండి విడివడునట్లు, హవై=నిశ్చయముగా, సః=త్రిమాత్రోపాసకుడు, పాప్మనా వినిర్ముక్తః= పాపమునుండి ముక్తుడై, సామభిః=ప్రాణములతో, బ్రహ్మలోకం ఉన్నీయతే=దర్శనీయమగు బ్రహ్మమున జేర్పబడును, సః=అతడు, ఏతస్మాత్ జీవ ఘనాత్=ఈశరీరమునుండి, పరాత్పరం = సూక్ష్మము కంటె సూక్ష్మ మగు, పురిశయం=బ్రహ్మాండ పురమున నిండియున్న, పురుషం-పరమేశ్వరుని, ఈక్షతే-సాక్షాత్కారము చేసికొనును, తత్ ఏతౌ శ్లోకౌ భవతః - ఈ విషయము నీ క్రింది రెండుశ్లోకములు స్పష్టము చేయును.

'అ - ఉ - మ్' అను త్రిమాత్రాత్మకమగు నోంకారముతో పరబ్రహ్మము నెవడు నిరంతర ముపాసించునో యతడు దేహాంతసమయమున పాము కుబుసమును విడిచి నూత్నకాంతియుత దేహముతో బ్రకాశించునట్లు తన భౌతికకాయమును విడిచి నిర్మలుడై - పాపరహితుడై బ్రహ్మమును బొందును-ముక్తుడగును. 'ఓమ్' అను నక్షరముతో నిత్యము బ్రహ్మమును ధ్యానించువాని ప్రాణమూర్ధ్వగతిని బొందును. అతని చిత్తము సత్వగుణ ప్రధానమై నిర్మల మగును, చిత్త సంస్కారము లన్నియు నుడిగిపోవును, నిర్వికల్పసమాధి ప్రాప్తించును అతనియందు జ్ఞానరూపతేజస్సు వర్ధిల్లును.

ఓంకారము నందలి యేకమాత్రోపాసనవలన, భూసంపద ద్విమాత్రోపాసన వలన చంద్రుని సౌమ్యశీలత, త్రిమాత్రోపాసనవలన సూర్యుని తేజః ప్రాప్తి జ్ఞానసంపద కలుగునని భావము. ఇట్లు త్రిమాత్రోపాసన ముఖ్యముగా బ్రహ్మప్రాప్తికి - ముక్తికి సాధన మగునని భావము.

"తిస్రో మాత్రా మృత్యుమత్యః ప్రయుక్తా
అన్యోన్యసక్తా అనవిప్రయుక్తాః,
క్రియాసు బాహ్యాభ్యంతరమధ్యమాసు
సమ్యక్ ప్రయుక్తాసు న కంపతే జ్ఞః." ౬

అన్యోన్యసక్తాః = పరస్పర సంబద్ధములై, అనవిప్రయుక్తాః = పరస్పర మొండొంటిని విడువక యుండు. మృత్యుమత్యః=వినాశముగల, ప్రయుక్తాః తిస్రః మాత్రాః = ధ్యానమున ప్రయోగింపబడిన ఓంకారపు మూడుమాత్రలు, బాహ్యాభ్యంతర మధ్యమాసు క్రియాసు = బాహ్యములు, అభ్యంతరములు, మధ్యమములునైన క్రియలలో, సమ్యక్ ప్రయుక్తాసు= ఉపాసనయందు బాగుగ ప్రయోగింపబడినపుడు, జ్ఞః=జ్ఞానియగు జీవుడు, న కంపతే=విచలితుడుకాడు.

ఓంకారమున 'అ + ఉ + మ్' అను మూడుమాత్రలు పరస్పర మిశితములయి యుండును. అట్లే శబ్దము, అర్థము, జ్ఞానము ననుమూడును పరస్పరాధ్యాసవలన సంయుక్తములై యుండును. ప్రళయకాలమున శబ్ద వినాశము కలుగును. కావున ఓంకారమాత్రలు మృత్యువు గలవిగా నిట వర్ణింపబడినవి. త్రిమాత్రాత్మకమగు నోంకారమును యోగి శారీరకములు, మానసికములు, ఉభయాత్మకములు నగు క్రియలందును బాగుగా నుపయోగించును. ఆ యా క్రియల నాచరించునపుడు కూడ యోగి చిత్తమున నోంకారము లగ్నమై యుండును. చిత్తమును ఓంకార వాచ్యమగు బ్రహ్మపర మొనర్చియే యుండునని భావము. అట్టియోగి యెన్నడును మోక్షమార్గము

నుండి విచలితుడు కాడు. ఆ యా కర్మల ఫలితములుగా నేర్పడు సుఖ దుఃఖములకు లోను గాడు.

"ఋగ్భి రేతం యజుర్భి రంతరిక్షం స సామభిర్
యత్ తత్ కవయో వేదయంతే, త మోంకారేణై
వాయతనే నాన్వేతి, విద్వాన్ యత్తచ్ఛాంత మజర
మమృత మభయం పరం చేతి." 7

సః=ఆ యోగియైన, విద్వాన్=విద్వాంసుడు, ఋగ్భిః=ఋక్కులతో, ఏతం=ఈ మనుష్యలోకమును, యజుర్భిః=యజుస్సులతో, అంతరిక్షం=అంతరిక్షమును, సామభిః=సామములతో, కవయః=పండితులు, యత్ వేదయంతే = దేని నెఱుగుదురో, తమ్ = దానిని – ఆలోకమును, ఓంకారేణ ఆయతనేన ఏవ=ఓంకారమనెడి యాలంబనముతోనే, అన్వేతి =యుక్తుడగును - పొందును. యత్తత్=యత్తద్ పదములచే చెప్ప బడు నా బ్రహ్మతత్త్వము, శాంతమ్=నిర్వికల్పము. అవస్థాభేదము లేనిది, అజరమ్=జీర్ణము కానిది, అమృతమ్=నాశములేనిది, అభయం = నిర్భ యము- దానినుండి యితరులకుకాని, యితరులనుండి దానికిగాని యెన్నడు భయమేర్పడదు. పరమ్=అత్యంత సూక్ష్మము.

యోగియైన విద్వాంసుడు ఋక్కులవలన పదార్థవిజ్ఞానము సంపా దించి మనుష్యలోకమున సుఖసంపదలతో వర్ధిల్లును. అతని వర్తనము పదార్థ విజ్ఞానమునకు విరుద్ధముగా నుండదు. కావున నతనికి దుఃఖములు కలుగవు. యజుర్వేద విహితములయిన అగ్నిహోత్రాది శుభకర్మల నాచ రించు సౌమ్యశీలుడై ప్రజల నానందింపజేయుచు చంద్రలోకమును జయిం చును. అనగా ప్రియదర్శనుడయి సౌజన్యమును ప్రకటించుచు సుఖించును. సామవేద ప్రతిపాదిత ప్రాణవిద్య నభ్యసించి - యోగాభ్యాసము నాచరించి సమాహితుడై బ్రహ్మము నెఱుగగల్గును. అతని సాధనమున చిత్తస్థైర్యము

కొఱకు ప్రణవము మాత్రము ఆలంబ మగును. కావుననే పతంజలియు 'తస్య వాచకః ప్రణవః తజ్జప స్తదర్థ భావనమ్'అని చిత్తైకాగ్రతకు ప్రణవ జపమును తదర్థ భావనమును సాధనముగా సూత్రించి యున్నాడు. ఇట్లు యోగి బ్రహ్మప్రాప్తికై యత్నించి ముక్తు డగును. బ్రహ్మము శాంతము, అజరము, అమృతము, అభయము, పరము నని యిట వర్ణింపబడినది.

వాక్యాంతమున గల ఇతి పదము ప్రశ్న సమాప్తిని సూచించును.

పంచమ ప్రశ్నము సమాప్తము.

షష్ఠ ప్రశ్నము

"అథ హైనం సుకేశా భారద్వాజః పప్రచ్ఛ, భగవన్! హిరణ్యనాభః కౌసల్యో రాజపుత్రో మా ముపేత్యైతం ప్రశ్న మపృచ్ఛత, షోడశకలం భారద్వాజ! పురుషం వేత్థ?, తమహం కుమార మబ్రువం నాహ మిమం వేద, యద్యహ మిమ మవేదిషం కథం తే నావక్ష్య మితి సమూలో వా ఏష పరిశుష్యతి యోఽనృత మభివదతి, తస్మా న్నార్హా మ్యనృతం వక్తుం, స తూష్ణీం రథ మారుహ్య ప్రవవ్రాజ, తం త్వా పృచ్ఛామి, క్వాసౌ పురుష ఇతి." ౧

అథ=తరువాత, భారద్వాజః=భరద్వాజగోత్రుడు, సుకేశా = సుకేశుడు, ఏనం=పిప్పలాదుని, పప్రచ్ఛ=అడిగెను. భగవన్ః = స్వామీః, కౌసల్యః=కోసలదేశపు, రాజపుత్రః = రాజకుమారుడు, హిరణ్యనాభః= హిరణ్యనాభు డనువాడు, మామ్ ఉపేత్య=నన్నుసమీపించి, ఏతం ప్రశ్నం అపృచ్ఛత=ఈః ప్రశ్నము నడిగెను, భారద్వాజః, షోడశకలం పురుషం వేత్థ? = పదునాఱు కళఌగల పురుషు నెఱుగుదువాః, తం కుమారం = ఆ రాజకుమారునకు, ఇమం=నీ వడిగిన పురుషుని, అహం=నేను, నవేద =ఎఱుగను అని, అబ్రువం=చెప్పితిని, అహం ఇమం య ద్యవేదిషమ్= నే నీ పురుషుని ఎఱిగిన వాడనైన, కథం తే నావక్ష్యమ్=నీ కెందులకు చెప్పనుః?, యః అనృతం అభివదతి=ఎవ డనృతము చెప్పునో, ఏషః = వాడు, వా=నిశ్చయముగః సమూలః పరిశుష్యతి=సమూలము నశించును, తస్మాత్=కావున, అనృతం వక్తుం = అనృతము చెప్పుటకు, నార్హామి ఇతి=అర్హుడను కాను అని (బదులు చెప్పితిని). సః=ఆరథనాభుడు, రథం ఆరుహ్య=రథమెక్కి, తూష్ణీం=మాఱు మాటాడక, ప్రవవ్రాజ = వెడలి పోయెను, కావున, తం = ఆ షోడశకలాత్మక పురుషునిగూర్చి, అసౌ=

అతడు, క్వ=ఎక్కడ, త్వా=నిన్ను, పృచ్ఛామి ఇతి = అడుగుచున్నాను, అని సుకేశుడు పిప్పలాదుని ప్రశ్నించెను.

శైబ్యు డడిగిన ప్రశ్నకు సమాధానము పిప్పలాదమహర్షి చెప్పి ముగించిన తదుపరి భరద్వాజ గోత్రమున బుట్టిన సుకేశుడు మహర్షి నిట్లడిగెను. భగవన్! కోసలదేశపు రాజకుమారుడు హిరణ్యనాభు డొక నాడు నన్ను సమీపించి, 'భారద్వాజ! షోడశ కళాత్మక పురుషు నెఱుగు దువా?' అని ప్రశ్నించియున్నాడు అప్పు డా రాజకుమారునితో 'నేనా పురుషు నెఱుగను ఎఱిగియున్న నేల చెప్పను? అనృతము చెప్పువాడు సమూలము నశించును. కావున నే ననృతము చెప్పజాలను' అని సమాధానము చెప్పగా నతడు మాఱుమాటాడక రథమునెక్కి వెళ్ళిపోయెను కావున నా రాజకుమారు డడిగిన పురుషు డెక్కడ ఉండునో చెప్పవలసినదని మిమ్ముల నడుగుచున్నాడ. దయతో చెప్పుదురుగాక! అని సుకేశుడు పిప్పలాదుని ప్రశ్నించెను

తస్మై స హోవాచ ఇహైవాంతఃశరీరే సోమ్య!
స పురుషో యస్మిన్నేతాః షోడశకలాః ప్రభవంతీతి.'' 2

సోమ్య!=సుకేశ!, యస్మిన్=ఎవనియందు, ఏతాః షోడశ కలా, =ముందు చెప్పబోవు పదునాఱుకళలు, ప్రభవంతి=ఉత్పన్నము లగునో? సః పురుషః=ఆపురుషుడు, ఇహ ఏవ అంతః శరీరే=ఇక్కడ నీ శరీరము నందే ఉన్నాడు, ఇతి=అని, సః = పిప్పలాదుడు, తస్మై = సుకేశునకు, ఉవాచ హ=స్పష్టముగా జెప్పెను.

ఐదవప్రశ్నలో కొంతవఱకు నిర్దేశింపబడిన పరమేశ్వరునిగూర్చియే విశేషముగ తెలిసికొనగోరి సుకేశు డీ యాఱవ ప్రశ్నమును పిప్పలాదు నడిగియున్నాడు. హిరణ్యనాభు డడిగిన షోడశకళల పురుషుడు పరమే శ్వరుడే అతని యునికిని గుర్తించుట కనువగుస్థాన మెయ్యదియో తెలిసి కొనుటయే యీప్రశ్నకు ముఖ్యాభిప్రాయము. కావుననే సుకేశుడు 'అసౌ

పురుషః క్వ?' ఈ పురుషుడెక్కడః అని ప్రశ్నించి యున్నాడు. దానికి సమాధానము పిప్పలాదుడు 'ఈ శరీరమునందే' యని చెప్పుచున్నాడు. ఉపాసకుడు శరీరమునందే హృద్దేశమున పరమేశ్వరుని గనును. 'ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున! తిష్ఠతి'' సర్వప్రాణులహృదయము నందే పరమేశ్వరు డున్నాడని భగవద్గీతయందు కృష్ణు డర్జునునకు జెప్పినట్లు నిర్దేశింపబడినది. పురుషుడు పూర్ణుడు బ్రహ్మాండమను పురమున నంతట వ్యాపించి నిండి యుండును కావున పరమేశ్వరుడు పురుష డనబడును. అట్లే జీవాత్మయు శరీర మనెడి పురమున నుండువాడు కావున నతడును పురుషశబ్దవాచ్యు డగుచున్నాడు. షోడశకళలను గూర్చి యీ యుపనిషత్తునందు (స ప్రాణ మసృజత ...) నాలుగవ వాక్యమున ముందు చెప్పబడును- కళలుగా వర్ణింపబడిన ప్రాణాదులతో జీవేశ్వరుల కిరువురకు సంబంధ మున్నది. పరమేశ్వరుడు వానిని సృజించును. అవి జీవునకు కార్యకారు లగును. కాని, ముఖ్యముగా కళల నుత్పన్నము చేయువాడు కావున పరమేశ్వరునితో వానిని సంబద్ధముచేసి ప్రశ్నింపబడినదని యెఱుగ వలయును కాని యీ కళలనుగూర్చి చెప్పుటకు ముందు జీవాత్మకు గలిగిన యొక సంశయమును గూర్చి మహర్షి యిట్లనుచున్నాడు.

"స ఈక్షాం చక్రే, కస్మిన్నహ ముత్క్రాంత ఉత్క్రాంతో
భవిష్యామి, కస్మిన్ వా ప్రతిష్ఠితే ప్రతిష్ఠాస్యామీతి." 3

సః=జీవాత్మ, సర్గారంభమున, ఈక్షాం చక్రే = ఇట్లాలోచించెను, కస్మిన్ ఉత్క్రాంతే=ఈశరీరమునుండి యేది ఉత్క్రమించిన - బయటికి వెడలిపోయిన, అహం ఉత్క్రాంతః భవిష్యామి=నేనుకూడ బయటికి వెళ్ళి పోవుదును?, వా=లేక, కస్మిన్ ప్రతిష్ఠితే=ఏది యీ శరీరమున నుండిన, ప్రతిష్ఠాస్యామి ఇతి = నే నీ శరీరమునందు ప్రతిష్ఠితుడ న గు దు ను- నిలుతును ? అని.

'ఈ శరీరము నుండి యేది వెడలిపోయిన నేను దీనినుండి నిర్గమింతును ? ఏది యీశరీరమునందు నిలిచియున్న నే నిందు నిలిచియుందును?, అని జీవు డీ శరీరమునుండి తనకు గలుగు ఉత్క్రమణ ప్రవేశములను గూర్చి ఆలోచింపవా డయ్యెను. జీవుడు తా నీ శరీరము నుండి వెడలి పోవుటకును, ఇందు ప్రవేశించుటకును నిమిత్త మేదైన నున్నదా? లేక ఏవి యున్న తా నీ శరీరమునం దుండ వీలగునో, ఏవి లేనినాడు తా నీ శరీరమునం దుండ వీలుకాదో వానివిగూర్చి జీవు డాలోచించినాడని వాక్యాభిప్రాయముగా నెఱుంగ నగును కావుననే రాబోవు చతుర్థ వాక్యమునందు పరమేశ్వరుడు జీవుని నిర్గమన ప్రవేశముల ననుసరించు ప్రాణాదులను సృష్టించి యున్నాడని మహర్షి చెప్పుచున్నాడు.

"స ప్రాణ మసృజత ప్రాణా చ్ఛ్రద్ధాం ఖం వాయుర్
జ్యోతి రాపః పృథివీంద్రియమ్, మనో౽న్న మన్నాద్
వీర్యం తపో మంత్రాః కర్మలోకాలోకేషు చ నామచ,"4

సః - ఆ పరమేశ్వరుడు, ప్రాణం - ప్రాణమును, అసృజత - ఉత్పన్న మొనర్చెను, ప్రాణాత్ - ప్రాణమునుండి, శ్రద్ధాం - శ్రద్ధను, ఖం-ఆకాశమును, వాయుః-వాయువు, జ్యోతిః - అగ్ని, ఆపః - నీరు, పృథివీ - భూమి, ఇంద్రియమ్ - శ్రోత్రాది ఇంద్రియములను, మనః - అంతరింద్రియమును, అన్నం-అన్నమును, అన్నాత్-దానినుండి, వీర్యం -వీర్యము-శుక్లము, తపః-తపస్సు, మంత్రాః-మంత్రములు, కర్మ - కర్మ, లోకాః - జనులు, లోకేషు చ నామ - ఆ లోకములందు నామమును అసృజత-సృష్టించెను.

పరమేశ్వరుడు భోక్తృశక్తి ప్రధానము, నన్నింటికి కారణభూతము, జీవనహేతువు నగు ప్రాణమును ప్రథమమున సృష్టించెను. అటుపైన శ్రద్ధ నుత్పన్న మొనర్చెను. ప్రాణ మున్ననాడే ప్రాణులందు శ్రద్ధయు నుండును. తరువాత ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమియు నను పంచస్థూల

భూతములు, భౌతికములగు త్వక్కు, చక్షువు, శ్రోత్రములు, జిహ్వ, ఘ్రాణము నను నింద్రియములు, ఇంద్రియ నాయకమగు మనస్సును సృష్టించెను. ఇంద్రియాదుల రక్షణ కనువగు అన్నము, దాని పరిణామరూపమగు వీర్యము నేర్పడెను. వీర్యబలమున నింద్రియ నిగ్రహాదిరూప తపస్సు, తన్మూలకమగు నాలోచనాత్మక ప్రయోగములు, వానివలన నేర్పడుకర్మలు-మైథునాదులు, తజ్జనిత ప్రాణిలోకము, దాని వ్యవహారమున కనువగు నామాదులు నన్నియు పరమేశ్వరుడు డేర్పఱచినా డని గుర్తింపనగును.

(పరమేశ్వరుడు జీవు లొనర్చు కర్మలు సుఖపూర్వకముగ సిద్ధించుట కనువుగ నీ కార్యజగత్తు-స్థూల ప్రపంచమును సృష్టించినాడు. ప్రాణము, శ్రద్ధ, ఆకాశము, వాయువు. అగ్ని, జలము, భూమి, ఇంద్రియములు, మనస్సు, అన్నము, వీర్యము, తపస్సు, మంత్రములు, కర్మ, లోకములు, నామము నను పదునాఱు అంశములతోగూడిన ప్రపంచమును నిర్మించినాడు. ఇవి యన్నియు పరమేశ్వర నిర్మితములు. అతడే వీని కాధారము-ప్రళయ కాలమున నన్నియు నశించి సూక్ష్మరూపమున నతనియందుండును. అందు వలన నతడు షోడశకళలు గల పురుషు డనబడును. ఈ కళలం దంతటను నతడు వ్యాపించి, యీశరీరము నందును బ్రహ్మాండము నందును నంతటను నిండియుండును. కావున పురుషు డనబడును.)

"స యథేమా నద్యః స్యందమానాః సముద్రాయణాః సముద్రం ప్రాప్యాస్తం గచ్ఛంతి, భిద్యేతే తాసాం నామరూపే సముద్ర ఇత్యేవం ప్రోచ్యతే, ఏవమే వాస్య పరిద్రష్టు రిమాః షోడశకలాః పురుషాయణాః పురుషం ప్రాప్యాస్తం గచ్ఛంతి, భిద్యేతే తాసాం నామరూపే పురుష ఇత్యేవం ప్రోచ్యతేస ఏషోఽకలోఽమృతో భవతి త దేష శ్లోకః." 5

ఇమాః నద్యః=ఈ నదులు, స్యందమానాః=ప్రవహించుచు, సముద్రాయణాః=సముద్రాశ్రయముగలవై, సముద్రం ప్రాప్య = సముద్రమున

జేరి, యథా అస్తంగచ్ఛంతి=ఎట్లు అస్తమించునో, తాసాం=వాని, నామ రూపే=నామరూపములు, భిద్యేతే = నశించునో, సముద్రః ఇతి ఏవం ప్రోచ్యతే = సముద్ర మని యిట్లు చెప్పబడును. ఏవమ్ ఏవ = ఇట్లే, పరిద్రష్టుః అస్య=సర్వతోద్రష్ట - సర్వజ్ఞుడు అగు పరమేశ్వరుని, ఇమాః షోడశకలాః= ఈ ప్రాణాదులైన పదునారు కళలును, పురుషాయణాః= పురుషాధిష్ఠానములయి, పురుషం ప్రాప్య=పురుషునిపొంది. అస్తంగచ్ఛంతి =అదృశ్యములగును, తాసాం=వాని, నామరూపే=నా మ రూ ప ము లు రెండును. భిద్యేతే=నశించును, పురుషః ఇతి ఏవం ప్రోచ్యతే=పురుషు డనియే చెప్పబడును, సః ఏషః =ఈ జీవు డట్టి పరమేశ్వరుని తెలిసికొనిన వాడై, అకలః అమృతః భవతి=కళలరూప శరీరమునుండి ముక్తుడై యమరు డగును, తత్ ఏషః శ్లోకః భవతి = ఈ విషయమునే రాబోవు శ్లోకము ప్రతిపాదించును.

లోకమున నదు లన్నియు ప్రవహించి పోయి సముద్రమున గలిసి నపుడు నదులనామములు కాని, వాని స్వరూపము కాని, ఉండవు. సముద్ర మనియే చెప్పబడును. అట్లే ప్రపంచ మంతయు ప్రళయ సమయమున సూక్ష్మమై పరమేశ్వరుని యందే స్థితికలిగి యుండును స్థూలరూపము నశించినందున నామరూపములు లేని దగును. పురుషునియందే లీనమై యుండుటచే పురుషు డనియే పిలువబడును స్థూలపదార్థముల నామరూప ములు ప్రత్యేకముగ వ్యవహరింపబడవు. వాని యుత్పత్తి వినాశములకు హేతువైన పురుషుడు వాని కధిష్ఠానముగమాత్ర ముండును. పరమేశ్వరు నిట్లెఱిగిన జీవుడు శరీరాదులనుండి ముక్తుడై శాశ్వతానందము ననుభ వించును. ఈ విషయమును గ్రంథాంతర శ్లోకములను ప్రమాణముగా నిచ్చి వివరించుచున్నాడు.

"అరా ఇవ రథనాభౌ కలా యస్మిన్ ప్రతిష్ఠితాః, తం వేద్యం పురుషం వేద యథా మావో మృత్యుః పరివ్యథా ఇతి." ౬

రథనాభౌ అరాః ఇవ=చక్రపు కుండలో ఆకులున్నట్లు, యస్మిన్ కలాః ప్రతిష్ఠితాః=ఎవనియందు కళలుస్థితములై యున్నవో, తం వేద్యం పురుషం=అతెలియదగిన పరమపురుషుని, యథా వేద=ఎట్లు జ్ఞాని తెలిసికొనునో, అట్లే మీరును తెలిసికొనుడు, మృత్యుః = మృత్యువు, వః = మిమ్ములను, మా పరివ్యథాః=వ్యథపెట్టకుండుగాక!, ఇతి = అని, పిప్పలాదుడు ప్రశ్నకర్తల నాశీర్వదించెను.

చక్రపుటాకులు చక్రమధ్యభాగమును (కుండ) ఆశ్రయించి స్థిరములయి యుండునట్లు పరమేశ్వరుని అధారమున ప్రాణాదిజగత్స్థితి యున్నది. ఇట్టి జగదాధారుడగు పరమేశ్వరు నెఱిగిన వారికి మృత్యుభయ ముండదు.

"తాన్ హోవా చై తావ దేవాహ మేతత్
పరం బ్రహ్మ వేద నాతః పర మస్తీతి." ౭

తాన్=సుకేశాది ప్రశ్నకర్తల నుద్దేశించి, పిప్పలాదుడు, అహమ్=నేను, ఏతావత్ ఏవ=ఇంతయే, ఏతత్ పరమ్ బ్రహ్మవేద = ఈ పరమ బ్రహ్మమునుగూర్చి యెఱుగుదును, అతః పరం న అస్తి=ఇంకకుమించి సూక్ష్మవస్తువొండు లేదు, ఇతి ఉవాచ=అని పలికెను.

సుకేశాది మునుల నుద్దేశించి పిప్పలాదు డిట్లనెను 'ఓ సౌమ్యులారా! పరబ్రహ్మమును గూర్చి నాకింతే తెలియును. ఇంతకుమించి తెలియదగు సూక్ష్మమొండు లేదుకూడ.'

"తే త మర్చయంత స్త్వం హి నః పితా యోఽస్మాక
మవిద్యాయాః పరంపారం తారయసీతి, నమః పరమ
ఋషిభ్యో నమః పరమ ఋషిభ్యః." ౮

తే=సుకేశాదులు, తమ్=ఆ పిప్పలాద మహర్షిని, అర్చయంతః=పూజించుచు, త్వమ్ హి నః పితా = నీవే మాకు తండ్రివి - రక్షకుడవు, యః = ఏ నీవు, అస్మాకం = మమ్ములను, అవిద్యాయాః పరం పారం

తారయసి ఇతి = అవిద్యనుండి ఒడ్డున జేర్చితివి, అని స్తుతించిరి. నమః పరమ ఋషిభ్యః = పరమర్షులకు నమస్కారముఅని పలుమారు పిప్పలాదునకు నమస్కరించిరి.

పిప్పలాద మహర్షి తమ ప్రశ్నలకు సమాధానము చెప్పగా విని, యెంతయు తుష్టులై, సుకేశాదిమునులార్గురు నా మహర్షికి నమస్కారాదుల మూలమున బహువిధముల పూజించి, 'అయ్యా! మీరే మాకు తండ్రులు - రక్షకులు, అవిద్యాజలధిలో మునిగియున్న మమ్ముల నుద్ధరించినారు. మీకు మా వందనములు' అని పలుమారు నుడివిరి.

'నమః పరమ ఋషిభ్యః' అను వాక్యమును రెండు పర్యాయములు ప్రయోగించుటతో ప్రశ్న సమాప్తి సూచింపబడినది.

షష్ఠ ప్రశ్నము సమాప్తము.

సకలశాస్త్ర నిష్ణాత శ్రీమత్ పండిత ముక్తి రామోపాధ్యాయ శిష్య

పండిత గోపదేవ విరచిత ప్రశ్నోపనిషత్తు యొక్క

ఆంధ్ర టీకా తాత్పర్యము

సమాప్తము

ఓమ్ తత్ సత్